# అగ్రనేత

తెలుగు దిన పత్రిక

TELTEL/2015/66279

రంగారెడ్డి | సంపుటి: 09 సంచిక :261 | ఎడిటర్ : ఉప్పుగల్ల సంతోష్ కుమార్ | తేది: మంగళవారం 24-12-2024 | పేజీలు:4 వెల: 2.00

## విజయసాయి దోపిడి అంతాఇంతా కాదు

అమరావతి,డిసెంబర్23 వైకాపా ఎంపీ విజయసాయిరెడ్డి దోపిడీ ముఠా చేయని కుంభకోణం లేదని తెదేపా ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి విమర్శించారు. విజయసాయి వియ్యంకుడికి ఆదాయం కోసం ప్రజలపై ట్రూఅప్ ఛార్జీలు వేశారన్నారు. అమరావతిలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. జెన్‌కోకు విజయసాయి అనుబంధ సంస్థ బొగ్గు అమ్మిందని ఆరోపించారు. 4.5 లక్షల టన్నుల నాసిరకం బొగ్గును.. టన్ను రూ.8,500లకు విక్రయించిందన్నారు. అధిక ధరకు కొని ప్రజలపై విద్యుత్ భారం మోపారని ఆగ్రహం వ్యక్తం చేశారు.ట్రైడెంట్ నాలెడ్జ్ కంపెనీ నాసిరకం బొగ్గు సరఫరాపై శాఖాపరంగా చర్యలు తీసుకోవాలని.. దీనిపై సీఐడీ, విజిలెన్స్ ఎందుకు చర్యలకు ఉపక్రమించట్లేదని ప్రశ్నించారు. విజయసాయి దొంగల ముఠాపై సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జగన్ కుంభకోణాలపై చర్యలకు వివిధ శాఖల్లో సిబ్బంది కూడా సరిపోవట్లేదని వ్యాఖ్యానించారు. 108, 104 స్కామ్ పైనా సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని వైద్య ఆరోగ్య శాఖ మంత్రిని సోమిరెడ్డి కోరారు.

# ఏడాదిన్నరలో పదిలక్షల ఉద్యోగాలు



న్యూఢిల్లీ,డిసెంబర్23: తమ పాలనలో యువతకు పెద్ద మొత్తంలో ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చామని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. గత ఒకటిన్నర ఏళ్లలో 10 లక్షల మందికి ఉద్యోగాలు ఇచ్చామన్నారు. దేశ చరిత్రలో ఇది పెద్ద రికార్డ్ అని పేర్కొన్నారు. ఉద్యోగాల భర్తీ పక్రియలో నిజాయతీ, పారదర్శకతకు పెద్దపీట వేస్తున్నామని తెలిపారు. నేడు జరుగుతున్న రోజ్‌గార్ మేళాలోనూ 71,000 మందికి పైగా యువతకు అపాయింట్‌మెంట్ లెటర్లు ఇచ్చామని తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీ సోమవారం వీడియో కాన్ఫరెన్సింగ్ ద్వారా కొత్తగా నియామకమైన 71,000 మందికి పైగా యువతకు అపాయింట్‌మెంట్ లెటర్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ ప్రసంగిస్తూ కొత్తగా నియమితులైన వారిని అభినందించారు. భారతదేశ యువతతో మాట్లాండేందుకు తాను కువైట్ నుంచి రాత్రి భారత్ వచ్చానని పేర్కొన్నారు. ఇక్కడికి వచ్చిన తర్వాత దేశంలోని యువతతో తన మొదటి కార్యక్రమం జరిగిందన్నారు. ఈ సందర్భంగా ఉద్యోగాలు పొందిన వారి కుటుంబాలకు హృదయపూర్వకంగా అభినందనలు తెలియజేస్తున్నట్లు తెలిపారు. భారతదేశ యువత సామర్థ్యాన్ని, ప్రతిభను పూర్తిగా వినియోగించుకోవడమే ప్రభుత్వ ప్రధాన కర్తవ్యమని ప్రధాని ఉద్ఘాటించారు. దేశాభివృద్ధిలో యువత కీలకపాత్ర పోషిస్తారని.. వారిలోని సామర్థ్యాలను వినియోగించుకోవడం ద్వారా ప్రభుత్వం మరింత ముందుకువెళుతుందని అన్నారు. ఇలా ఉద్యోగాలు పొందినవారంతా భక్తితో, నిజాయతీతో దేశం కోసం పని చేస్తున్నారని.. ఇలాగే ముందుకుసాగితే 2047 కల్లా వికసిత భారత్ లక్ష్యాన్ని చేరుకోగలమని ప్రధాని వ్యాఖ్యానించారు. దేశ అభివృద్ధి యువత పైనే ఆధారపడి ఉంటుందని.. అయితే గత ప్రభుత్వాలు వారికి సరైన ఉపాధి కల్పించకపోవడం వల్ల దేశం వెనకబడిపోయిందన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక యువతకు అధిక ప్రాధాన్యం ఇస్తోందని.. అందుకనుగుణంగా మేక్‌ఇన్ ఇండియా, ఆత్మనిర్భర్ భారత్, డిజిటల్ ఇండియా వంటి కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రస్తుతం భారత్ అన్నిరంగాల్లో ముందుకువెళ్తుందని.. అంతరిక్షం, రక్షణ, మొబైల్ తయారీ, పునరుత్పాదక ఇంధనం, పర్యటక రంగాల్లో భారత్ ప్రపంచంలోనే అగ్రగామిగా ఎదుగుతోందని పేర్కొన్నారు. రోజ్‌గార్ మేళాలో అందించిన నియామక పత్రాల్లో అధిక సంఖ్యలో యువతులు ఉన్నారని మోదీ పేర్కొన్నారు. మహిళలు అన్నిరంగాల్లో స్వయంప్రతిపత్తిని సాధించాలనే లక్ష్యంతో తమ ప్రభుత్వం పని చేస్తుందని అన్నారు. అన్ని ప్రాంతాల యువతకు అనుకూలంగా ఉండేందుకు 13 భారతీయ భాషల్లో రిక్రూట్‌మెంట్ పరీక్షలు నిర్వహించాలని కేంద్ర ప్రభుత్వం యోచిస్తున్నట్లు వెల్లడించారు. రోజ్‌గార్ మేళా ద్వారా ఈ దిశగా నిరంతరం కృషి చేస్తున్నామని ప్రధాని మోదీ ప్రస్తావించారు. గత 10 సంవత్సరాలుగా వివిధ ప్రభుత్వ మంత్రిత్వ శాఖలు, సంస్థల్లో ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించాలనే ప్రచారం జరుగుతోందన్నారు. నేటికీ 71,000 మందికి పైగా యువతకు అపాయింట్‌మెంట్లు ఇచ్చారు. గత ఏడాదిన్నర కాలంలో మా ప్రభుత్వం దాదాపు 10 లక్షల మంది యువతకు ప్రభుత్వ ఉద్యోగాలను శాశ్వతంగా కల్పించిందని మోదీ పేర్కొన్నారు. ఇది స్వతహాగా భారీ రికార్డు అని ప్రధాని అన్నారు. ఈ విధానంలో యువతకు శాశ్వత ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించేందుకు గత ప్రభుత్వాల హయాంలో ఇలాంటి చొరవ జరగలేదని, నేడు దేశంలో లక్షలాది మంది యువత ఉద్యోగాలు పొందారని పేర్కొన్నారు. ఏ దేశమైనా అభివృద్ధి చెందాలంటే యువత బలం, నాయకత్వం నుంచే పుడుతుందని ప్రధాని అభిప్రాయం వ్యక్తం చేశారు. పారదర్శకమైన సంప్రదాయం నుంచి వస్తున్న యువత పూర్తి భక్తి, నిజాయితీలతో దేశ సేవలో నిమగ్నమై ఉన్నందుకు సంతోషిస్తున్నట్లు ప్రధాని అన్నారు. 2047 నాటికి దేశాన్ని అభివృద్ధి చెందిన భారతదేశంగా తీర్చిదిద్దాలన్నది మా సంకల్పమన్నారు. ఈ లక్ష్యాన్ని సాధించడంలో పూర్తి విశ్వాసం ఉందన్నారు. గత దశాబ్ద కాలంలో ప్రభుత్వం అనేక విధానాలను తీసుకొచ్చిందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. మేక్ ఇన్ ఇండియా, స్వావలంబన భారత్ ప్రచారం, స్టార్టప్ ఇండియా, స్టాండ్ అప్ ఇండియా, డిజిటల్ ఇండియా ఇలా ప్రతి స్కీమ్ యువతను కేంద్రంగా చేసుకుని రూపొందించినట్లు వెల్లడించారు. అంతరిక్ష రంగంలో భారత్ తన విధానాలను మార్చుకుంది. భారతదేశం తన రక్షణ రంగంలో తయారీని ప్రోత్సహించింది. దీనిలో యువత ఎక్కువగా లాభపడింది. నేడు భారతదేశ యువత కొత్త విశ్వాసంతో నిండి ఉంది. ప్రతి రంగంలోనూ యువత విజయపతాకం రెపరెపలాడుతోంది. ప్రపంచంలో ఐదో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా మనం అవతరించామని ప్రధాని గుర్తు చేశారు. భారతదేశం ప్రపంచంలో మూడవ అతిపెద్ద స్టార్టప్ పర్యావరణ వ్యవస్థగా ఉంది. ఈ క్రమంలో ఒక యువకుడు తన సొంత స్టార్టప్‌ను ప్రారంభించాలని నిర్ణయించుకున్నప్పుడు, వారు పూర్తి పర్యావరణ వ్యవస్థను పొందుతారని పేర్కొన్నారు. ఈ క్రమంలో నేడు దేశంలోని వేలాది మంది యువత జీవితాలు కొత్త పుంతలు తొక్కుతున్నాయని పేర్కొన్నారు. కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ మాట్లాడుతూ.. ఈ రోజు ఇచ్చిన 71,000 ఉద్యోగాల్లో 29 శాతానికి పైగా ఓబీసీలు, 15.8 శాతం షెడ్యూల్ కులాలు, 9.6శాతం షెడ్యూల్ తెగలు ఉన్నారని అన్నారు. గత ప్రభుత్వాలతో పోలిస్తే ఎన్డీఏ హయాంలో ప్రభుత్వ ఉద్యోగాల్లో వెనకబడిన తరగతుల రిక్రూట్‌మెంట్ 27శాతం పెరిగిందని చెప్పారు.

# పీవీ నరసింహా రావు తెలంగాణలో పుట్టడం మనందరికి గర్వకారణం

హైదరాబాద్: ఆర్థికవేత్త, రాజనీతిజ్ఞుడు, బహుభాషా కోవిదుడు భారతరత్న, మాజీ ప్రధాని పీవీ నరసింహా రావు వర్ధంతి సందర్భంగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఘనంగా నివాళులర్పించారు. ఆర్థిక సంస్కరణలతో భారతదేశ ముఖచిత్రాన్ని మార్చిన మాజీ ప్రధాని పీవీ నరసింహా రావు తెలంగాణలో పుట్టడం మనందరికి గర్వకారణమని చెప్పారు. గడ్డు కాలంలో దేశానికి ప్రధానిగా సేవలందించిన పీవీ.. ఆర్థిక సంక్షోభం నుంచి దేశాన్ని కాపాడారని, తన పాలనతో ఆధునిక భారతానికి బాటలు వేశారని తెలిపారు.రాష్ట్ర ఏర్పాటు తర్వాత.. తెలంగాణ ముద్దుబిడ్డ పీవీ నరసింహా రావు గారిని బీఆర్ఎస్ ప్రభుత్వం సముచితంగా గౌరవించిందని వెల్లడించారు. పీవీ నరసింహా రావు శత జయంతి ఉత్సవాలను కేసీఆర్ ప్రభుత్వం ఘనంగా నిర్వహించిందని గుర్తుచేశారు. నెక్లెస్ రోడ్‌కి పీవీ మార్గ్ అని పేరు పెట్టిందని, ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేసిందన్నారు. వెటర్నరీ యూనివర్సిటీకి పీవీ పేరు పెట్టిందని చెప్పారు. అంతే కాదు.. పీవీ నరసింహా రావుకి భారతరత్న ఇవ్వాలని తెలంగాణ ప్రభుత్వం తరపున



కేంద్ర ప్రభుత్వానికి తీర్మానం పంపించిందని తెలిపారు. వారి కూతురిని ఎమ్మెల్సీగా గౌరవించిందన్నారు. భారతరత్న పీవీ.. తెలంగాణ ఠీవి అని ఎక్స్ వేదిగా ట్వీట్ చేశారు.

# రేవంత్ రెడ్డి నిర్ణయం.. ఏపీ ప్రభుత్వాన్ని ఇరకాటంలో పెడుతుందా?



హైదరాబాద్,తెలంగాణ ప్రభుత్వం కొత్త సినిమాల బెనిఫిట్ షోలు, టికెట్ రేట్లపై కీలక నిర్ణయం తీసుకున్న సంగతి తెలిసిందే. సంధ్య థియేటర్ తొక్కిసలాట ఘటన నేపథ్యంలో ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అసెంబ్లీలో కీలక ప్రకటన చేసారు. తాను సీఎం పదవిలో ఉన్నన్ని రోజులు ఎలాంటి బెనిఫిట్ షోలకు, టికెట్ రేట్లు పెంచుకోవడానికి అనుమతి ఇవ్వనని అన్నారు. ఎంత పెద్ద హీరో అయినా, భారీ బడ్జెట్‌తో తీసినా బెనిఫిట్ షోలకు మాత్రం అనుమతి ఇవ్వబోమని సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తేల్చిచెప్పారు. స్వాతంత్ర్య పోరాటానికి, తెలంగాణ ఉద్యమానికి సంబంధించిన సినిమాల విషయంలో అలోచించి నిర్ణయం తీసుకుంటామని అన్నారు. దీంతో ఈ విషయం మీద ఏపీ ప్రభుత్వం నిర్ణయం ఎలా ఉండబోతోందనేది ఆసక్తికరంగా మారింది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాలు ఇప్పటి వరకూ తెలుగు సినీ పరిశ్రమకు ఫేవర్ గా ఉంటూ వచ్చాయి. ఏపీలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత, సినిమాలకు బెనిఫిట్ షోల అనుమతి లభిస్తోంది. టికెట్ ధరల పెంపుపై సానుకూలంగా స్పందిస్తూ వస్తోంది. ఇటీవల కాలంలో వచ్చిన 'కల్కి' 'దేవర' 'పుష్ప 2' లాంటి పెద్ద సినిమాలకి రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ టికెట్ రేట్లు పెంచుకునేందుకు, బెనిఫిట్ షోలకు రెండు ప్రభుత్వాలు అనుమతులు ఇచ్చాయి. అయితే 'పుష్ప 2' ప్రీమియర్ షో సమయంలో హైదరాబాద్ సంధ్య థియేటర్ వద్ద చోటు చేసుకున్న ఘటన, తదనంతర పరిణామాలతో తెలంగాణ ప్రభుత్వం ఇకపై బెనిఫిట్ షోలు, స్పెషల్ టికెట్ రేట్లు ఉండవని ప్రకటించింది. ఇది పరోక్షంగా ఏపీ ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చే అవకాశం ఉందనే కామెంట్స్ వినిపిస్తున్నాయి.'పుష్ప 2' సినిమాకి భారీగా టికెట్ రేట్లు పెంచుకోడానికి పర్మిషన్ ఇవ్వడంతో, సామాన్య ప్రజానీకానికి సినీ వినోదం అందుబాటులో లేకుండా చేస్తున్నారనే విమర్శలు వచ్చాయి. అయితే తెలంగాణాలో బెనిఫిట్ షోలు బ్యాన్ చేస్తున్నారనే విషయాన్ని పక్కన పెడితే, టికెట్ రేట్ల పెంపుపై ఇప్పుడు రేవంత్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి సామాన్యుల నుంచి మద్దతు లభిస్తోంది. తెలంగాణ రాష్ట్రంలో సామాన్యులకు అందుబాటులో ఉండేలా సినిమా టికెట్ ధరలు ఉన్నప్పుడు, ఆంధ్రప్రదేశ్ లో రేట్లు పెంచుకోడానికి అనుమతిస్తే అది ప్రభుత్వంపై విమర్శలకు ఆస్కారం ఇచ్చినట్లే అవుతుందనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. అందుకే ఈ విషయంలో ఏపీ సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఎలా ముందుకు వెళ్తారో అనే చర్చలు జరుగుతున్నాయి.సంక్రాంతికి టాలీవుడ్ లో పలు పెద్ద సినిమాలు విడుదల కాబోతున్నాయి. రామ్ చరణ్ నటించిన 'గేమ్ ఛేంజర్', నందమూరి బాలకృష్ణ 'డాకు మహారాజ్', వెంకటేష్ 'సంక్రాంతికి వస్తున్నాం' చిత్రాలు పెద్ద పండక్కి ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాయి. వీటికి తెలంగాణ ప్రభుత్వం స్పెషల్ షోలకు, టికెట్ రేట్ల పెంపుకు అనుమతి ఇవ్వకపోతే ఓపెనింగ్ కలెక్షన్స్ మీద ప్రభావం పడే అవకాశం ఉంది. బెనిఫిట్ షోస్ రద్దు, టికెట్ రేట్లు పెంపు లేదని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేసిన నేపథ్యంలో సోమవారం మధ్యాహ్నం 1 గంటకు తెలంగాణ ఎగ్జిబిటర్స్ అసోసియేషన్ మీడియా సమావేశం ఏర్పాటు చేయనున్నట్లు సమాచారం అందుతోంది.మరోవైపు దిల్ రాజు సినిమాలకు టికెట్ హైక్స్, బెనిఫిట్ షోస్ ఇస్తే తమకు కూడా ఇస్తారని సితార నిర్మాత సూర్యదేవర నాగవంశీ అంటున్నారు. తెలంగాణ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ దిల్ రాజు నిర్మించిన 'గేమ్ ఛేంజర్', 'సంక్రాంతికి వస్తున్నాం' సినిమాలు సంక్రాంతికి రిలీజ్ అవుతున్నాయి. నాగవంశీ నిర్మించిన 'డాకు మహారాజ్' కూడా అదే సీజన్ లో షెడ్యూల్ చేయబడింది. ఈ నేపథ్యంలోనే తెలంగాణ రాష్ట్రంలో దిల్ రాజు సినిమాలకు టికెట్ రేట్లు, బెనిఫిట్ షోలు ఇస్తే తమకు కూడా ఇస్తారని నాగవంశీ వ్యాఖ్యానించారు.అయితే ఏపీలో సినీ ఇండస్ట్రీకి తప్పకుండా ప్రత్యేక రాయితీలు ఉంటాయని నిర్మాత ఆశాభావం వ్యక్తం చేసారు. "ప్రభుత్వం వైపు నుంచి ఇండస్ట్రీకి ఫుల్ సపోర్ట్ ఉంటుందని అధికారంలోకి వచ్చిన వెంటనే ఫస్ట్ మీటింగ్ లోనే పవన్ కల్యాణ్ చెప్పారు. అప్పటి నుంచి రిలీజైన సినిమాలన్నిటికీ గవర్నమెంట్ సపోర్ట్ ఉంది. ఆ సపోర్ట్ ఎప్పుడూ అలానే ఉంటుందని ఆశిస్తున్నాం" అని తాజాగా 'డాకు మహారాజ్' ప్రెస్ మీట్ లో నాగవంశీ అన్నారు. మరి టికెట్ హైక్స్, బెనిఫిట్ షోల విషయంలో తెలంగాణ ప్రభుత్వ నిర్ణయం తర్వాత, ఏపీ ప్రభుత్వ వైఖరి ఎలా ఉంటుందో వేచి చూడాలి.

# అంతరాష్ట్ర దొంగ అరెస్టు.. 31తులాల బంగారం స్వాధీనం..

జగిత్యాల, అంతరాష్ట్ర దొంగల ముఠా అరెస్టు చేసినట్లు జగిత్యాల డీఎస్పీ రఘుచందర్ తెలిపారు. సోమవారం పట్టణంలోని సబ్ డివిజినల్ పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఇటీవలే జరిగిన దొంగతనం కేసులో అంతరాష్ట్ర దొంగల ముఠా సభ్యులను పట్టుకోవడానికి టౌన్ ఇన్స్ పెక్టర్ వేణు గోపాల్ ఆధ్వర్యంలో బృందం ముమ్మరంగా గాలింపు చేపట్టిందన్నారు.ముఠా సభ్యురాలు హత్గాడే కాంతను సోమవారం పట్టణంలోని టవర్ సర్కిల్ లో గల ఓ బంగారం దుకాణంలో అదుపులోకి తీసుకున్నామన్నారు. గత కొంతకాలంగా ఈ ముఠా సభ్యులు మంచిర్యాల లక్షిపేట, జగిత్యాల, సిరిసిల్ల, ఆర్మూర్, నిజామాబాద్ బస్టాండుల్లో నిఘా ఉంచి వచ్చి పోయే ప్రయాణికులపై దృష్టి పెట్టి వారి వద్ద ఉన్న విలువైన బంగారు ఆభరణాలను వారికి తెలియకుండా దొంగలిస్తున్నారని తెలిపారు.జగిత్యాల ఓల్డ్ బస్టాండ్ లో ఇటీవలే ఓ మహిళపై నిఘా ఉంచి ఆమెకు తెలియకుండా ఆమె వద్ద ఉన్న బంగారు ఆభరణాలను దొంగలించారని, దొంగలించిన బంగారు ఆభరణాలను అమ్మడానికి ప్రయత్నం చేస్తున్న క్రమంలో సోమవారం పట్టణంలోని టవర్ సర్కిల్ ప్రాంతంలో ముఠా సభ్యురాలైన



మహారాష్ట్రకు చెందిన హత్గాడే కాంతను అదుపులోకి తీసుకుని ఆమె వద్ద నుండి 31 తులాల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నామన్నారు.ముఠా సభ్యులైన హత్గాడే గుజాన, సంజన నాడే లను త్వరలోనే పట్టుకుంటామన్నారు. ప్రజలు తమ పరిసర ప్రాంతాల్లో అనుమానాస్పద వ్యక్తులు సంచరిస్తే డయల్ 100, స్థానిక పోలీస్ స్టేషన్ కు సమాచారం అందించాలన్నారు. ఈ సమావేశంలో టౌన్ ఇన్స్ పెక్టర్ వేణుగోపాల్, ఎస్ఐ కిరణ్ కుమార్, హెడ్ కానిస్టేబుల్ నసీర్ ఖాన్, కానిస్టేబుల్ కిరణ్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# సహానాన్ని కోల్పోయా..క్షమించండి



హైదరాబాద్,డిసెంబర్23:హైదరాబాద్ సీపీ సీవీ ఆనంద్ క్షమాపణలు చెప్పారు. జాతీయ ÷ఖడియాను ఉద్దేశించి తాను చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుంటున్నట్లు పోస్ట్ పెట్టారు. సంధ్య థియేటర్ ఘటనపై జాతీయ మీడియా ప్రశ్నలు అడిగినప్పుడు తాను సహనాన్ని కోల్పోయినట్లు తెలిపారు. సంధ్య థియేటర్ వద్ద అసలేం జరిగిందో తెలుపుతూ నగర పోలీసు కమిషనర్ సీవీ ఆనంద్ తాజాగా మీడియా సమావేశం నిర్వహించిన సంగతి తెలిసిందే. థియేటర్‌లో ఆరోజు ఏం జరిగిందో తెలుపుతూ కొన్ని వీడియోలను విడుదల చేశారు. ఈక్రమంలో మీడియా ఆయన్ను కొన్ని విషయాలపై ప్రశ్నించగా.. నేషనల్ మీడియా ఈ ఘటనకు మద్దతు ఇస్తుందంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు. దీంతో అక్కడ ఉన్న కొందరు జర్నలిస్టులు ఈ ఆరోపణలను తప్పుపట్టారు. తాజాగా తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుంటున్నట్లు సీవీ ఆనంద్ ఎక్స్‌లో పోస్ట్ పెట్టారు. 'ఈ ఘటనపై విచారణ జరుగుతోంది. ప్రెస్‌మీట్‌లో రెచ్చగొట్టే ప్రశ్నలు వేయడంతో నేను కాస్త సహనాన్ని కోల్పోయాను. పరిస్థితులు ఎలా ఉన్నా సంయమనం పాటించాల్సి ఉంటుంది. నేను చేసింది పొరబాటుగా భావిస్తున్నాను. నేషనల్ మీడియాపై చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుంటున్నా. క్షమాపణలు కోరుతున్నా' అని తెలిపారు. మరోవైపు సంధ్య థియేటర్ ఘటనపై దర్యాప్తు కొనసాగుతోందని, న్యాయపరమైన సలహాలు తీసుకుని ముందుకెళ్తామని హైదరాబాద్ సీపీ సీవీ ఆనంద్ తెలిపారు. డిసెంబరు 4న సంధ్య థియేటర్ వద్ద జరిగిన ఘటనపై మీడియా అడిగిన ప్రశ్నలకు సీపీ సమాధానమిచ్చారు. ఘటనకు సంబంధించిన సీసీ ఫుటేజ్‌ను ఆయన విడుదల చేశారు. ఇక ఈ ఘటనపై తాజాగా సినీ నటి, కాంగ్రెస్ నాయకురాలు మాజీ ఎంపీ విజయశాంతి స్పందించారు. ఇలాంటి ఘటన జరగడం దురదృష్టకరమన్నారు. దీనిపై తెలంగాణ సీఎం రేవంత్‌పై కేంద్రమంత్రులు ఆరోపణలు చేయడం గర్హనీయమన్నారు. ఈ ఘటనను తమకు అనుకూలంగా మార్చుకునేందుకు భాజపా నేతలు యత్నిస్తున్నారన్నారు. సినీ పరిశ్రమకు అన్ని ప్రాంతాల ప్రజల ఆదరణ కావాలని.. ఇలాంటి ఘటనలు జరగకుండా సమస్యను పరిష్కరించుకునేందుకు ప్రయత్నం చేయాలని సూచించారు.

# క్రిస్మస్ పండుగను అధికారికంగా నిర్వహించిన ఒకేఒక్క ముఖ్యమంత్రి కేసీఆర్

మెదక్: క్రిస్మస్‌ను అధికారికంగా నిర్వహించిన ఒకే ఒక్క ముఖ్యమంత్రి కేసీఆర్ అని బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు (హరీశ్ రావు) అన్నారు. ప్రతి క్రిస్మస్‌కు పేద క్రైస్తవులకు గిఫ్ట్ ఇచ్చారని చెప్పారు. గత తొమ్మిదన్నరేండ్ల బీఆర్ఎస్ పాలనలో క్రిస్టియన్ సోదరులు, సోదరీమణులకు కేసీఆర్ ఏం చేశారు? ఎంత బాగా చూసుకున్నారో అందరికీ తెలుసు. మెదక్ చర్చి వందేండ్ల వేడుకల్లో హరీశ్ రావు పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం మాట్లాడుతూ.. మెదక్ చర్చి వందేండ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఇంత గొప్ప కార్యక్రమంలో పాల్గొనడం సంతోషంగా ఉంది. ప్రతీ ఒక్కరికి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. వందేండ్లుగా ఆసియాలోనే రెండో అతిపెద్ద క్రైస్తవ పుణ్యక్షేత్రంగా మెదక్ చర్చి వర్ధిల్లుతున్నదని చెప్పారు.కల్లోల జగతికి శాంతి సందేశం అందించిన కరుణామయుడి గొప్ప ప్రార్థన మందిరంగా ప్రఖ్యాతిగాంచింది. చర్చి నిర్మాణాన్ని'కు చెందిన రెవరెండ్ చార్లెస్ వాకర్ ఫాస్‌నెట్ 1914లో ప్రారంభిం చారని, 1924 డిసెంబర్ 25న పూర్తయిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వారి మనవడు పాల్గొనడం ఆనందంగా కార్యక్రమం. 1914లో మెదక్ ప్రాంతంలో తీవ్ర కరువు ఉండేది. ప్రజలు ఆకలితో అలమటించేవారు. చార్లెస్ వాకర్ ఫాస్నెట్ కరువుతో అల్లాడుతన్న ప్రజలను చూసి చలించారు. ఉచితంగా కాకుండా ప్రజలకు పని చూపి, వారి ఆకలి తీర్చాలని సంకల్పించారు. అలా వారిచేత ఏసుక్రీస్తు మందిరం నిర్మిస్తూ, వారి ఆకలిని తీర్చారు. చరిత్రాకమైన ఈ చర్చి మెదక్ జిల్లాలో ఉండటం మనకే కాదు, యావత్ తెలంగాణ రాష్ట్రానికి ఎంతో గర్వకారణం.కేసీఆర్ ప్రభుత్వం పోయి, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి ఏడాది పూర్తయింది. గత తొమ్మిదన్నరేండ్ల బీఆర్ఎస్ పాలనలో క్రిస్టియన్ సోదరులు, సోదరీమణులకు కేసీఆర్ గారు ఏం చేశారు? ఎంత బాగా చూసుకున్నారో అందరికీ తెలుసు. క్రిస్మస్ పండుగను రాష్ట్ర పండుగగా అధికారికంగా ప్రకటించా రు, ఘనంగా నిర్వహించారు. క్రిస్మస్ ను అధికారికంగా జరిపిన ఒకే ఒక్క ముఖ్యమంత్రి కేసీఆర్. క్రిస్మస్ దే మరుసటి రోజు జరుపుకునే బాక్సింగ్ డేను సెలవుగా ప్రకటించారు. అంటే డిసెంబర్ 25తో పాటు 26న కూడా ఘనంగా జరుపుకునే లా రెండు రోజులు సెలవు ఇచ్చారు. ప్రతి క్రిస్మస్ పండుగ నాడు పేద క్రైస్తవులకు గిఫ్ట్ ఇచ్చారు.



కేసీఆర్..ఒక్క మతమని కాదు, హిందూ,ముస్లిం, క్రిస్టియన్, సిక్కు ఇలా అన్ని మతాలను గౌరవించి,వారు సంతోషంగా జీవించేలా చూశారు. అన్ని వర్గాలు కాబట్టే హైదరాబాద్, తెలంగాణ భిన్నత్వంలో ఏకత్వం అనడానికి నిదర్శనంగా నిలుస్తోంది. ఇది ఇలాగే కొనసాగాలని కోరుకుం టున్నాను.శాంతి, కరుణ, క్షమాగుణం నేర్పే క్రీస్తు బోధనలు సర్వమానవాళి ఆచరణీయం.ప్రజలందరికి సుఖ శాంతుల కలగాలని ఆ యేసును ప్రార్థిస్తున్నాను.మరొక్కసారి క్రిస్టియన్ సోదర సోదరీమణులకు శుభాంక్షలు తెలుపుతున్నాను.'అని హరీశ్ రావు అన్నారు.

## అమెరికాలో అనుమానాస్పదస్థితిలో విద్యార్థి మృతి

హైదరాబాద్,అమెరికాలో ఉన్నత చదువులు, ఉద్యోగావకాశాల కోసం యూఎస్ వెళ్లిన పలువురు విద్యార్థులు అక్కడ జరిగిన ప్రమాదాల్లో మరణిస్తున్నారు. తాజాగా తెలంగాణ రాష్ట్రానికి చెందిన ఓ విద్యార్థి అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. హన్మకొండ జిల్లా కమలాపూర్ మండలం మాదన్నపేటకు చెందిన 25 ఏళ్ల బండి వంశీ గతేడాది జులైలో ఉన్నత చదువుల కోసం అమెరికా వెళ్లాడు. అక్కడ మిన్నెసోటాలో పార్ట్‌టైం జాబ్ చేస్తూ.. ఎంఎస్ చదువుతున్నాడు. అయితే, అతడు ఆదివారం తాను ఉంటున్న అపార్ట్‌మెంట్‌లోని గ్రౌండ్ ఫ్లోర్‌లో ఉన్న కారులో శవమై కనిపించాడు.

## సంపాదకీయం

**మంగళవారం 24-12-2024**

### సమ భావం!

రెండువేల ఏళ్లనాటి మనువాదం ఇప్పటికీ భారతీయ సమాజాన్ని ఏదో ఒక రూపంలో పీడిస్తూనే వుంది. 'స్త్రీ ఎప్పుడూ తండ్రి, భర్త, కొడుకు సంరక్షణలోనే వుండాలని, వేధించి హింసించే భర్తను కూడా పూజించాలి' అనే పురుషాధిక్య భావజాలాన్ని ఆధునిక యుగంలోనూ చలామణీ చేసేందుకు మనువాదులు యత్నిస్తున్నారు. దానికి నిదర్శనమే నేటికీ కొనసాగుతోన్న లింగ వివక్ష. స్త్రీ పట్ల సమాజం ఎంత అమానవీయంగా ప్రవర్తిస్తోందో తెలుపుతూ%ొ% 'నువ్వు ఆడదానివి, గీత దాటకూడని దానివి, మచ్చపడితే మాయని దానివి' అంటుందని చెబుతారు అబ్బూరి ఛాయాదేవి. ఈ మచ్చలు, గీతలు స్త్రీలకే గాని పురుషులకు లేవంటుందీ సమాజం. ఈ సమాజంలో అమ్మాయిలకు అడుగడుగునా అవరోధాలే.. వారి కదలికలపై ఎన్నో ఆంక్షలు, నిర్బంధాలు. పాప-బాబు, అమ్మాయి-అబ్బాయి, మహిళ-పురుషుడు అన్న ఈ పదాల మధ్య గీతలు చెరిపేసి, సమానం అని చెప్పాలనుకున్నా, పురుషాధిపత్య భావజాలం ఏదోఒక రూపంలో మొలకెత్తుతూనే వుంది. ఇంట్లో కనీసం ఒక్క మగపిల్లాడైనా వుండాలని కోరుకునే భావన బలంగా వేళ్లూనుకుని వుంది. అమ్మాయిలైతే పెళ్లి తర్వాత అత్తవారింటికి వెళ్లిపోతారు, అదే అబ్బాయిలైతే వృద్ధాప్యంలో తమ బాగోగులు చూసుకుంటారని, తమకు ఆదరువుగా వుంటారని కొందరు తల్లిదండ్రులు భావిస్తుంటారు. కానీ, కొడుకు కంటే కూతురే నయమని అనుభవం చెబుతోంది.సమాజం అన్ని రంగాల్లోనూ మారుతున్నా%ొ% అమ్మాయిలు- అబ్బాయిల పెంపకం విషయంలో మాత్రం పెద్దగా మార్పు చోటుచేసుకోలేదు. 'వాడికేం? మగమహారాజని/ ఆడా, మగా వాగినప్పుడే అర్థమైపోయింది/ పెళ్లంటే పెద్ద శిక్ష అని/ మొగుడంటే స్వేచ్ఛా భక్షకుడని/ మేం పాలిచ్చి పెంచిన జనంలో సగమే/ మమ్మల్ని విభజించి పాలిస్తోందని' అంటారు సావిత్రి. ఈ తరహా విభజన ప్రాథమిక పాఠ్యాంశాల నుంచి సాహిత్యం వరకూ, సీరియళ్ల నుంచి సినిమాల వరకూ అబ్బాయిలకు ప్రాధాన్యతనివ్వడం చూస్తూనే వున్నాం. విద్యలోనూ వివక్షతే. మగపిల్లలను బయట చదువులకు పంపించే తల్లిదండ్రులు%ొ% ఆడపిల్లలను పంపడానికి సంకోచిస్తారు. ఎవరో ఒకరినే చదివించాల్సిన పరిస్థితివుంటే%ొ% అబ్బాయిలకే ప్రాధాన్యతనిస్తారు. పిల్లల పుట్టుక దగ్గర నుంచి పెంపకం వరకూ ఈ వివక్ష అడుగడుగునా కొనసాగుతూనే వుంది. గర్భంలో ఉన్నది ఆడపిల్ల అని తెలిస్తే పిండ దశలోనే అంతమొందిస్తున్నారు. 'జనాభా లెక్కల్లో స్త్రీలకంటే పురుషుల సంఖ్యే ఎక్కువ' అని కేంద్ర ప్రభుత్వం గత వందేళ్లుగా నిర్వహించిన జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే నివేదికలు చెబుతున్నాయి. ఇదంతా పురుషాధిపత్య భావజాల ఫలితమే. 'భ్రష్టుడా! / అమ్మ రుణం తీరదురా/ అమ్మకు అమ్మవై పుడితే తప్ప' అంటారు ఆచార్య గోపి. ఈ మార్దవం అబ్బాయిల్లో జీర్ణించుకునేలా పెంచడం తల్లిదండ్రుల బాధ్యత. అమ్మాయి, అబ్బాయి సమానమేనన్న భావన ఇంటి నుంచి, చిన్న వయసు నుంచే మొదలవ్వాలి. అది తల్లిదండ్రుల బాధ్యత. ఇంటర్నెట్ యుగంలో%ొ% సోషల్‌మీడియా, ఏఐ వంటి మాధ్యమాలు అందుబాటులో వున్న నేపథ్యంలో టీనేజ్ పిల్లల భావోద్వేగాలను నిశితంగా గమనిస్తుండాలి. ఒకవైపు కార్పొరేటీరణ, మరోవైపు మనువాదం నేర్పిన సనాతనధర్మం పురుష మెదళ్లలో చెత్తలా పేరుకుపోతోంది. ఈ చెత్తను తొలగించే బాధ్యత ఇంట్లో తల్లిదండ్రులది, పాఠశాలలో ఉపాధ్యాయులది. ఇంట్లో తల్లిని, చెల్లినీ గౌరవించడం నేర్పాలి. బయటి స్త్రీలకు కూడా అంతే గౌరవ మర్యాదలివ్వాలి. పాఠ్యాంశాల్లోనూ అమ్మాయి-అబ్బాయి సమానమన్న భావన పాదుకొల్పాలి. ఆ దిశగా అబ్బాయిలను పెంచాలి. వారి మానసిక వికాసానికి తోడ్పడాలి. వంట చేయడం, ఇల్లు తుడవడం వంటివి కేవలం అమ్మాయిల పని మాత్రమే కాదు, అబ్బాయిలూ నేర్వాలన్న విజ్ఞత తల్లిదండ్రులే నేర్పాలి. 'అన్ని బాధ్యతల్నీ సమానంగా పంచుకునే మనం/ మన బరువు దించేందుకు చేయందించరేమని నిలదీయాలి/ మన పిల్లల నుంచైనా/ ఇంటి పనంటే ఇంతులది కాదని నేర్పాలి/ అమ్మాయిలతో పాటు అబ్బాయికీ అంట్లు తోమడం అలవాటు చేయాలి' అంటారు పాటిబండ్ల రజని. అబ్బాయిల పెంపకంలో ఈ తరహా మార్పు అవసరం.

# 'మునిసిపల్ ' సమ్మె ఒప్పందాల అమలులో నిర్లక్ష్యం



హైదరాబాద్,రాష్ట్రంలో గత 7 నెలల క్రితం ఏర్పడిన తెలుగుదేశం కూటమి ప్రభుత్వంపైన అన్ని రంగాల కార్మికులతోపాటు మున్సిపల్ కార్మికులు కూడా గంపెడు అశలు పెట్టుకున్నారు. ముఖ్యంగా మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు గత వైసిపి ప్రభుత్వ పాలనలో తమకు జరిగిన అన్యాయానికిగాను కసితో తెలుగుదేశం కూటమికి ఓట్లు వేశారు. టిడిపి ప్రభుత్వం ఏర్పడిన తరువాత నారా లోకేష్, ఇతర మంత్రులను పలుమార్లు కలిసి జీతాలు పెంచి తమ కుటుంబాలను ఆదుకోవాలని వేడుకున్నారు. అయినప్పటికీ జీతాల పెంపు విషయంలో ప్రభుత్వం నుండి ఏ విధమైన స్పందన లేకపోవడంతో పోరు బాట పట్టేందుకు సిద్ధపడుతున్నారు.

**గత ఒప్పందాలు అటకెక్కినట్టేనా?**

వైసిపి ప్రభుత్వ హయాంలో 'సమాన పనికి సమాన జీతం, కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల పర్మినెంట్' హామీల అమలు కోసం మున్సిపల్ కార్మికులు దీర్ఘకాలిక పోరాటాలు నిర్వహించారు. నిర్బంధాలు, అరెస్టులు, అక్రమ కేసులు ఎదుర్కొని మిలిటెంట్ పోరాటాలు నిర్వహించారు. 2023 డిసెంబర్ 26 నుండి 2024 జనవరి 11వ తేదీ వరకు 17 రోజులు చారిత్రాత్మక సమ్మె నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం దిగి వచ్చి 'క్లీన్ ఎన్విరాన్‌మెంట్' వర్కర్లకు (33,500 మందికి) రూ.15 వేల నుండి రూ.21 వేలకు, యుజిడి, చెత్త వాహనాల డ్రైవర్లకు రూ.18,500 నుండి రూ.24,500కు జీతాలు పెంచుతూ జీవో ఎం.ఎస్. నెంబర్ 36 జారీ చేసింది. 12-13 వేల మందిగా ఉన్న ఇంజనీరింగ్ కార్మికులకు జీతాల పెంపు కోసం 9 మంది అధికారులతో కమిటీ ఏర్పాటు చేసింది. ఈ సమ్మె సందర్భంగా రాష్ట్ర వ్యాపితంగా నమోదు చేసిన పోలీసు కేసులన్నింటిని ఉపసంహరిస్తూ 2024 మార్చి 15వ తేదీ 357 జీవోను జారీ చెయ్యడమంటే రాష్ట్ర కార్మికోద్యమ చరిత్రలో గర్వించదగిన పోరాటం.మున్సిపల్ రంగంలోని 48 వేల మందిగా ఉన్న ఇంజనీరింగ్, పారిశుధ్య కార్మికులందరికీ వర్తింపచేసే విధంగా నాటి ప్రభుత్వం రాతపూర్వకంగా ఇచ్చిన హామీలు ఊసులో లేకుండా పోయాయి. రిటైర్మెంట్ బెనిఫిట్లు (10 సంవత్సరాల సర్వీసు ఉంటే రూ.75 వేలు ఆ పైన ఏడాదికి రూ.2 వేలు అదనంగా), ప్రమాద బీమా రూ.5 లక్షల నుండి రూ.7 లక్షలకు పెంపు, దహన సంస్కారాలకు రూ.15 వేల నుండి రూ.20 వేలకు పెంపు, ఇంజనీరింగ్ కార్మికుల జీతాల పెంపు, సంక్షేమ పథకాలు, పర్మినెంట్ కార్మికులకు సరండర్ లీవ్‌లు, జి.పి.ఎఫ్ అకౌంట్లు తదితర డిమాండ్ల పరిష్కారానికి 2024 జనవరి 24వ తేదీన నాటి ప్రభుత్వం ఫైనాన్స్ డిపార్ట్‌మెంట్‌కు సిఫార్సు చేసింది. కాగా ఆ తరువాత సాధారణ ఎన్నికలు రావడంతో ఈ ఫైళ్ల వ్యవహారం మూలన పడింది. తెలుగుదేశం కూటమి ప్రభుత్వం వచ్చీ రాగానే ఫైనాన్స్ డిపార్ట్‌మెంట్‌లో ఉన్న మున్సిపల్ కార్మికుల ఫైళ్లన్నింటిని తిరిగి వెనక్కి పంపించింది. ఇది జరిగి 5 నెలలు గడిచినా పట్టించుకునే నాథుడు లేడు. దీనితో తెలుగుదేశం కూటమి ప్రభుత్వంపై మున్సిపల్ కార్మికులు పెట్టుకున్న ఆశలు అడియాసలుగా మారుతున్నాయనే ఆందోళన ప్రారంభమైంది.రాష్ట్రంలో ఉద్యోగులతో పాటు కొన్ని శాఖలలో రిటైర్మెంట్ వయస్సును 62 ఏళ్ళకు పెంచారు. కాని మున్సిపల్ కార్మికులకు మాత్రం పెంచలేదు. 60 ఏళ్ళు నిండాయనే సాకుతో బలవంతంగా ఉద్యోగాల నుండి తొలగిస్తున్నారు. దీర్ఘకాలిక వ్యాధులతో బాధ పడుతున్నవారి, చనిపోయిన వారి స్థానంలో వారి పిల్లలకు ఉద్యోగాలు ఇవ్వడంలేదు. గత ఏడాది కాలంగా చనిపోయిన వారి కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియో చెల్లించడంలేదు. ఇవి కాకుండా పి.ఎఫ్ క్లెయిమ్‌లు రకరకాల సాకులతో దీర్ఘకాలికంగా పెండింగ్ పెడుతున్నాయి. కార్మికులకు పని చేసేందుకు అవసరమైన పనిముట్లు సైతం సక్రమంగా అందించడంలేదు. అధికారులకు ఎన్ని సార్లు విన్నవించినా చెవిటివాని ముందు శంఖం ఊదినట్లుగానే ఉంటున్నది.


**కునారిల్లుతున్న కార్మికుల జీవితాలు**

వీధి లైట్లు, వాటర్ సెక్షన్, టౌన్ ప్లానింగ్, గార్డెనింగ్, వెటర్నరీ, మెకానిక్‌లు తదితర విభాగాలలో పని చేస్తున్న ఇంజనీరింగ్ కార్మికులకు పనికి తగిన విధంగా జీతాలు చెల్లించడంలేదు. 2012లో ప్రభుత్వం జారీ చేసిన జీవో ఎం.ఎస్. నెంబర్ 11 లోని క్యాటగిరీల ప్రకారం మున్సిపల్ కార్మికులకు జీతాలు చెల్లించడంలేదు. 2018 వరకు పారిశుధ్య కార్మికులతో సమానంగా ఇంజనీరింగ్ కార్మికులకు కూడా జీతాలు చెల్లించారు. ప్రస్తుతం అత్యధిక మంది ఇంజనీరింగ్ కార్మికులకు రూ.15 వేలు మాత్రమే జీతాలు చెల్లిస్తున్నారు. ప్రమాదకరమైన విధులు నిర్వహిస్తున్నప్పటికీ రిస్క్ అలవెన్స్ చెల్లించడంలేదు. దూర ప్రాంతాలకు వెళ్లి పని చేసే సందర్భంలో కనీసం టిఎ, డిఎలు కూడా ఇవ్వడంలేదు. ఎమర్జెన్సీ సర్వీసు పేరుతో ఊడిగం చేయిస్తున్నారు తప్ప వీరి కుటుంబాల గురించి పట్టించుకోవడంలేదు.

**నేటికీ వెట్టిచాకిరినే**

దశాబ్దాల తరబడి పని చేస్తున్న వందలాది మంది ఎన్.ఎం.ఆర్ కార్మికులకు నేటికీ రూ.13 వేలు మాత్రమే జీతాలు చెల్లిస్తున్నారు. పట్టణాల విస్తరణ మేరకు కార్మికుల సంఖ్యను పెంచాలని మున్సిపాల్టీల నుండి ప్రతిపాదనలు వచ్చి అనేక సంవత్సరాలు గడుస్తున్నా ఆర్థికశాఖ అనుమతులు ఇవ్వడంలేదు. మున్సిపల్ కౌన్సిల్ తీర్మానాల పేరుతో పని చేయిస్తున్న బదిలీ, కోవిడ్ కార్మికులను మున్సిపల్ కార్మికులుగా గుర్తించకుండా 12 వేల రూపాయలు మాత్రమే జీతాలు ఇస్తున్నారు. పల్నాడు జిల్లా నర్సరావుపేటలో నెలంతా పని చేయించుకొని కేవలం రూ.4-5 వేలు మాత్రమే చెల్లిస్తున్నారు. ఎన్‌టిఆర్ జిల్లా నందిగామలో ఇదే పరిస్థితి కొనసాగుతున్నది. తమను వెట్టిచాకిరీ నుండి విముక్తి చెయ్యాలని ఎన్ఎంఆర్, బదిలీ, కోవిడ్ కార్మికులు ప్రభుత్వాలను కోరుతున్నారు.రాష్ట్రంలో పాలకులు మారారు తప్ప విధానాలు మారడంలేదు. శాశ్వత స్వభావం కలిగి విధులు నిర్వహిస్తున్న మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చెయ్యకుండా ఒప్పంద కార్మికుల పేరుతో పాలకులు దగా చేస్తున్నారు. తెలుగుదేశం కూటమి అధికారంలోకి వచ్చాక గత సమ్మె కాలపు ఒప్పందాల అమలు పట్ల అనుసరిస్తున్న నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ రాష్ట్ర వ్యాపితంగా దశలవారీ ఆందోళనా పోరాటాలకు ఎ.పి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ (సిఐటియు) రాష్ట్ర కమిటీ పిలుపునిచ్చింది. గత ఏడాది సమ్మె ప్రారంభమైన డిసెంబర్ 26వ తేదీన రాష్ట్ర వ్యాపితంగా ధర్నాలు, సమ్మె ముగింపు రోజైన జనవరి 11వ తేదీన రిలే నిరాహార దీక్షలు, ఇంజనీరింగ్ కార్మికుల జీతాల పెంపునకు జనవరి 3వ తేదీన ధర్నాలు చేయాలని నిర్ణయించింది. ఈ పిలుపుల్లో మున్సిపల్ కార్మికులందరూ పాల్గొని జయప్రదం చెయ్యాలని కార్మికులకు విజ్ఞప్తి చేస్తున్నది.

# జల కాలుష్యం ప్రాణాంతకం



హైదరాబాద్,నగరాల్లో సురక్షిత మంచినీటి సరఫరా ఒక సవాలుగా మారింది. వాడుకగా వచ్చే వ్యర్థ జలాల ప్రక్షాళన సరిగ్గా జరగకపోవడంతో ఆ జలాలన్నీ మంచి నీటి వనరుల్లో నదుల్లో కలిసి కలుషితం చేస్తున్నాయి. ఉదాహరణకు హైదరాబాద్ నగరంలో కలుషిత నీటి సమస్యకు భయపడి దూరాన ఉన్న గోదావరి నదినుంచి పైపులైన్ల ద్వారా నీటిసరఫరాకు 'భగీరథ' ప్రయత్నం చేస్తున్నారు. ఇంకా వేసవి రాకముందే హైదరాబాద్ నగరంలో మల్కాజిగిరి, ఆనంద్ బాగ్ వంటి ప్రాంతాల్లో నీటి ఎద్దడి ప్రారంభం కావడం గమనార్హం. నీటి సరఫరా జరిగే ప్రాంతాల్లో కలుషిత జలాల సమస్య పీడిస్తోంది. పైపుల లీకేజీతో మంచినీరు కూడా కలుషితమై విషతుల్యమవుతోంది. చెన్నైలోని సబర్బన్ ప్రాంతం పల్లవరంలో ఇటీవల తుపాన్ ప్రభావంతో భారీ వర్షాలు కురిసి మంచినీటి వ్యవస్థ దెబ్బతింది. పైపుల ద్వారా వచ్చే కలుషిత నీరు ముగ్గురి ప్రాణాలను బలిగొనడం, మరో 34 మంది ఆస్పత్రిపాలు కావడం అత్యంత శోచనీయం. రాష్ట్ర ప్రభుత్వ సంస్థ ద్వారానే పైపుల ద్వారా ఈ ప్రాంతానికి మంచినీటి సరఫరా జరుగుతోంది. అయితే ఆ ప్రాంత ప్రజలు శుచి, శుభ్రతను పాటించకపోవడం వల్లనే ఇలా జరిగిందని తమిళనాడు రాష్ట్ర మంత్రి ఒకరు ఆరోపించడం బాధ్యతా రాహిత్యమే. దేశంలోని పట్టణాల్లో కలుషిత జలాలు సరఫరా అవుతుండటం తీవ్ర సమస్యగా ఉంటోంది. ఈకోలి బ్యాక్టీరియా అత్యధిక శాతం నిండి ఉన్న నీటిని తాగడం వల్లనే భారీ ఎత్తున ప్రజలు అస్వస్థులైన సంఘటనలు గత ఆరు నెలల్లో బెంగళూరు, కొచి, నొయిడా, విజయనగరం, నగరాల్లో సంభవించాయి.రెండేళ్ల క్రితం హైదరాబాద్ నగరంలో కొన్ని ప్రాంతాల్లోని నీటిలో ఈకోలి బ్యాక్టీరియా విస్తరించి ఉన్నట్టు పరీక్షల్లో తేలిన సంగతి తెలిసిందే. బతుకుతెరువు కోసం నగరాలకు వలసవచ్చే వేలాది మందికి కనీసం తాగడానికి మంచినీళ్లు, వాడుక నీరు పోడానికి డ్రైనేజీ సౌకర్యం వంటి కనీస సదుపాయాలు సమకూర్చలేని దుస్థితిలో నగరాలు ఉంటున్నాయి. ఉష్ణమండల దేశమైన భారత్ వంటి దేశాల్లో సురక్షిత తాగు నీటిని ప్రజలకు అందించడం ప్రభుత్వాలకు సవాలుగా మారింది. జలశక్తి మంత్రిత్వశాఖ డేటా ప్రకారం దేశంలోని 25 రాష్ట్రాల్లోని 230 జిల్లాల్లో భూగర్భ జలాల్లో ఆర్సెనిక్, అలాగే 27 రాష్ట్రాల్లోని 469 జిల్లాల్లో ఫ్లోరైడ్ వంటి హానికరమైన మూలకాలు బయటపడ్డాయి. ప్రపంచ వ్యాప్తంగా 1.7 బిలియన్ మంది మలమూత్రాలమయమైన నీటినే తాగునీటిగా వాడుతున్నారని ప్రపంచ ఆరోగ్య సంస్థ 2022లో వెల్లడించింది.ఫలితంగా డయేరియా వంటి వ్యాధులు ప్రబలి ప్రపంచం మొత్తం మీద ఏటా మిలియన్ మంది ప్రాణాలు కోల్పోతున్నారు. సురక్షితమైన నీటిని, పారిశుద్ధ సౌకర్యాలను పొందడం మానవ హక్కుగా 2010లో ఐక్యరాజ్యసమితి గుర్తించింది. మరో ముఖ్యమైన సమస్య భూగర్భ జలాలు రసాయనాల కలుషితం కావడంకూడా ఎవరూ పట్టించుకోవడం లేదు. తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ గత అసెంబ్లీ ఎన్నికల ముందు ఈ సమస్యను గుర్తించారు. తమిళనాడు పదేళ్ల విజన్‌లో తమిళనాడు అభివృద్ధికి చేపట్టనున్న ఏడు ప్రాధాన్య అంశాలను వివరించారు. అందులో మంచినీటి సమస్య కూడా ప్రస్తావించారు. తాగునీటి సరఫరా తలసరి వాటా 9 లక్షల లీటర్ల నుంచి 10 లక్షల లీటర్ల వరకు పెంచుతామని హామీ ఇచ్చారు. నీటి వృథాను 50% నుంచి 15 శాతానికి తగ్గిస్తామన్నారు. వాడుక నీటిని రీసైకిల్ చేసి మళ్లీ వినియోగించగలిగేలా చేస్తామన్నారు. ఆ నీటిసరఫరా 5% నుంచి 20 శాతానికి పెంచుతామన్నారు.ఇప్పుడు సురక్షిత మంచినీటిని సరఫరా చేయడమే ఆయనకొక సవాలుగా మారింది. ఒడిశాలో 20172022 మధ్య కాలంలో 42 లక్షల మంది కలుషిత నీటితో డయేరియా, టైఫాయిడ్‌ల బారిన పడ్డారు. అంటే ఒడిశా రాష్ట్ర జనాభాలోని పదోవంతు మంది కలుషిత నీటి వల్లనే తీవ్రవ్యాధుల బారినపడవలసి వచ్చింది. ఆ రాష్ట్రంలోని ఐదు మున్సిపల్ కార్పొరేషన్లలో స్టార్మ్ వాటర్ డ్రైనేజీ, సూయెజ్ మేనేజ్‌మెంట్ పరిశీలించగా కనీసం 42.23 లక్షల మంది ఎక్యూట్ డయేరియా డీసెంట్రీ (ఎడిడి)కి, మరో 4.62 లక్షల మంది టైఫాయిడ్‌కు గురయ్యారని ప్రజారోగ్యశాఖ తాజాగా సమర్పించిన నివేదికలో వెల్లడైంది. ఐదు జిల్లాల్లో ఆరుగురు మృతి చెందారు. రాష్ట్రాల భాగస్వామ్యంతో కేంద్ర ప్రభుత్వం అమలు లోకి తెచ్చిన జల్‌జీవన్ మిషన్ పథకం దేశం మొత్తం మీద 15.32 కోట్ల గ్రామీణ కుటుంబాలకు వర్తింపచేయాలన్న లక్ష్యం పెట్టుకున్నారు. ఈ పథకంలో మొత్తం లబ్ధిదారుల్లో 79% మందికి పైపుల ద్వారా ఇంటికే మంచినీళ్లు అందిస్తారు. ఇందులో ఒడిశా వాటా 75 శాతం. పథకం లక్ష్యం ఉత్తమంగా ఉన్నా దానిని సరిగ్గా నిర్వహించలేకపోవడమే అసలు సమస్య. అర్బన్, రూరల్ ఏరియాల్లో మురుగు నీటి పారుదల సౌకర్యం లోపించడం. వ్యర్థ జలాల ప్రక్షాళన సరిగ్గా జరగక పోవడంతో అనేక సమస్యలు ఎదురవుతున్నాయి. దీంతో పాటు పరిశ్రమల కాలుష్యాలు నీటివనరులు, నదుల్లోకి వచ్చి కలుస్తున్నాయి. భారమైన లోహాల మూలకాలున్న ప్రమాదకరమైన నీటితోనే కూరగాయలను పండించడం కూడా వ్యాధులకు దారి తీస్తోంది. దీనికి ఉదాహరణగా హైదరాబాద్ శివారు ప్రాంతాల్లో మూసీ కలుషిత జలాలతో కూరగాయల సాగు జరుగుతోందని అధ్యయనాలు వెల్లడించాయి.

## ఓట్ల కోసం తాము పనిచేయడంలేదు

అమరావతి,ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అల్లూరి సీతారామరాజు జిల్లా బల్లగరువులో పర్యటించారు. అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన అనంతరం ఆయన మాట్లాడుతూ... పంచాయతీరాజ్ శాఖ తీసుకున్నందుకు తాను ప్రజలకు ఏదైనా చేయగలుగుతున్నాను అంటే అందుకు కారణం ప్రజలు ఓట్లేసి కూటమి ప్రభుత్వాన్ని గెలిపించడమేనని అన్నారు. అధికారంలో ఉండడం వల్లే ప్రజలకు మేలు చేయగలుగుతున్నానని వివరించారు. ఒకటి కాదు, రెండు కాదు... 164 అసెంబ్లీ సీట్లు, 21 ఎంపీ స్థానాలు ఇచ్చారని వ్యాఖ్యానించారు. "ఇందాక పాత్రికేయ సోదరులు అడుగుతున్నారు.... ఈ పార్లమెంటు స్థానం మీ కూటమికి దక్కలేదు కదా అన్నారు. వాళ్లకి నేను ఒకటే చెప్పాను... మాకు ఓట్లు వేయని ప్రజల కోసం కూడా మేం పనిచేస్తాం...

## రైతు బంధు ఇస్తే... అసలు చర్చ ఎందుకు..?

హైదరాబాద్,రైతులకు ఇచ్చే రైతు బంధ పథకంలో వివిధ కారణాలతో ఎగనామం పెట్టేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కుట్ర చేస్తుందని మాజీ మంత్రి కేటీఆర్ అన్నారు. గత ప్రభుత్వం అమలు చేసిన రైతుబంధు పథకం లబ్ధిదారులకు ఉన్నది ఉన్నట్టు ఇచ్చే ఉద్దేశం ఉంటే రైతుబంధుపై చర్చ ఎందుకు..? అని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్ నిలదీశారు. రైతుభరోసాపై ప్రభుత్వం చేపట్టిన స్వల్పకాలిక చర్చ సందర్భంగా కేటీఆర్ మాట్లాడారు. గత ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రారంభించి రూ. 73 వేల కోట్లు రైతుల ఖాతాల్లో జమ అయ్యాయన్నారు. మేం ఒక దఫా మాత్రమే చెల్లించామని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు చెప్పడం అభినందనీయమని పేర్కొన్నారు. రైతుబంధు రూ. 21,283 కోట్ల దుర్వినియోగం జరిగిందని మంత్రి తుమ్మల చెప్పారని, 2019-20లో సాగు విస్తీర్ణం 141 లక్షల ఎకరాలని మంత్రే చెప్పారని గుర్తు చేశారు. 2020-21లో సాగు విస్తీర్ణం 204 లక్షల ఎకరాలు అని మీరు ఇచ్చిన నివేదికలో ఉందని, రైతుబంధు ఇవ్వడం వల్లే సాగు విస్తీర్ణం 2 కోట్ల ఎకరాలకు పెరిగిందన్నారు.నాలుగున్నర లక్షల గిరిజన బిడ్డలకు పోడు పట్టాలు ఇచ్చిన ఘనత కేసీఆర్‌దని కేటీఆర్ స్పష్టం చేశారు. ఆర్వోఎఫ్ఆర్ పట్టాల కింద ఉన్న భూముల్లో ఒక పంట మాత్రమే సాగు చేసే అవకాశం ఉంటుందన్నారు. మేజర్ కాల్వలు ఉండకపోవడం వల్ల చాలా కష్టంతో సాగు చేస్తారన్నారు. ఈ గిరిజన బిడ్డలకు రెండో విడత రైతుబంధు ఇస్తారా..? ఇవ్వరా..? సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఇక పత్తి 45 లక్షల ఎకరాల్లో పండుతుందని, ఈ పంట కాలం 8 నెలలు, మరి పత్తి రైతుకు ఒకటే పంటకు ఇస్తారా..? రెండు పంటలకు ఇస్తారా..? అలాగే కంది పంట కాలం కూడా 8 నెలలు.. కాబట్టి కంది పంటకు ఒకటే సారి ఇస్తారా..? రెండు సార్లు ఇస్తారా..? లేదా అనేది చెప్పాలి అని కేటీఆర్ డిమాండ్ చేశారు. రైతుబంధుకు కోతలు పెట్టే ఆలోచన లేకపోతే పీఎం కిసాన్ గురించి మంత్రి తుమ్మల ఎందుకు ప్రస్తావించారని నిలదీశారు. పీఎం కిసాన్ మార్గదర్శకాలు మీకు మార్గదర్శకం అయితే.. 25 శాతం మంది రైతులకు మాత్రమే రైతు భరోసా వర్తిస్తుందన్నారు. పీఎం కిసాన్ మార్గదర్శకాలు పాటించమని మంత్రి తుమ్మల చెబుతున్నారని, మరి ఉన్నది ఉన్నట్టు ఇచ్చేందుకు రైతుబంధుపై చర్చ ఎందుకు..? రైతుబంధుకు కోతలు పెట్టం అనుకుంటే ఎందుకీ చర్చ. కంది, పత్తి 8 నెలల పంట. పామాయిల్ పంటను విపరీతంగా ప్రోత్సహించామన్నారు. పామాయిల్ పంటకు, మామిడి తోటలకు రైతుభరోసా ఇస్తారా..? ఇవ్వరా..? రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల్లో మూడు పంటలు సాగు చేసే వారు ఉన్నారన్నారు. మరి మూడు పంటలకు రైతుభరోసా ఇస్తారా..? ఇదే శాసనసభలో ప్రతిపక్షంలో ఉన్నప్పుడు రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. మూడో పంటకు ఎందుకు ఇవ్వరు అని మా ప్రభుత్వాన్ని నిలదీశారు. కాబట్టి మూడో పంటకు రైతుబంధు ఇస్తారా..? ఇవ్వరా..? అనే దానిపై స్పష్టమైన ప్రకటన చేయాలని కేటీఆర్ డిమాండ్ చేశారు.

## నిరుపేదల ఆస్తులు కొల్లగొట్టారు

హైదరాబాద్, తెలంగాణలో ధరణి పోర్టల్ తీసుకొచ్చి అక్రమాలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకునేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. ఇప్పటికే ఈ చట్టాన్ని రద్దు చేసి భూ భారతీ తీసుకొచ్చిన ప్రభుత్వం ఇప్పుడు ధరణి అక్రమాలపై దృష్టి పెట్టింది. ఈ చట్టం పేరుతో చేసిన కబ్జాలను వెలుగులోకి తీసుకొచ్చేందుకు ఫోరెన్సిక్ విచారణ చేస్తున్నట్టు సభలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ప్రకటించారు. 'ధరణి'పై పూర్తి స్థాయిలో విచారణ జరిపిస్తామని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో 1 లక్షా 50 వేల కోట్ల విలువ చేసే భూములు చేతులు మారాయని మంత్రి పొంగులేటి ఆరోపించారు. లిటిగేషన్‌లో ఉన్న భూములను పార్ట్-బీ లో పెట్టి ఆ భూములను సక్రమం చేసుకున్నారని దోచిన భూములను బీఆర్ఎస్ నేతలు తమ అస్మదీయులకు విచ్చలవిడిగా రిజిస్ట్రేషన్లు చేశారన్నారు. కొన్నిచోట్ల భూములకు యజమానులు ఇక్కడ లేరని .. దేశ విభజన సమయంలో పాకిస్తాన్ వెళ్లిపోయారని, అధికారులు నో అబ్జెక్షన్ అని చెప్పారంటూ ఆ భూములను కూడా కాజేశారని పేర్కొన్నారు. ధరణి వల్ల అక్రమంగా రిజిస్ట్రేషన్ అయిన భూమి ముగ్గురు, నలుగురు వ్యక్తులు మీద మాత్రమే బదలాయింపు అయిందని ఆరోపించారు. ధరణి పేరుతో నిరుపేదల ఆస్తులను కూడా కొల్లగొట్టారన్నారు. అలాగే ధరణి వల్ల సుమారు 25 వేల ఎకరాల అసైన్డ్ భూములు అన్యాక్రాంతమయ్యాని ప్రభుత్వం భావిస్తోంది. ఒక్క ఇబ్రహీంపట్నం పరిధిలోనే 10 వేల ఎకరాలు అన్యాక్రాంతం చేశారని ప్రభుత్వ వర్గాలంటున్నాయి. అక్కడ ఎకరా రూ.10 కోట్ల విలువ ఉంటుందని న్యాక్రాంతమైన 25 వేల ఎకరాల భూముల మొత్తం విలువ రూ.2.50 లక్షల కోట్లుగా అంచనా వేస్తున్నారు. ధరణి మసుగులో జరిగిన భూ ఆక్రమనలన్నీ బయట పెడతామని, దీని వెనకాల ఎంత పెద్దవారున్నా వదిలే ప్రసక్తేలేదని ఇప్పటికే పలు సందర్భాలలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి చెప్పారు. గత పదేళ్లలో చోటు చేసుకున్న భూ ఆక్రమణల మీద సమగ్ర విచారణ చేయడానికి సిట్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. అసెంబ్లీలో దీనిపై ప్రకటన చేయలేదు కానీ రేపో మాపో ఉత్తర్వులు జారీ చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి. గతంలో చేసిన తప్పులను సరిదిద్దుకోకుండా భారాస సభ్యులు వక్రబుద్ధితో వ్యవహరిస్తున్నారని తెలంగాణ రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి విమర్శించారు. 'భారాస సభ్యులు భూ భారతి బిల్లును ఆమోదించకుండా అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారు. వారి తీరు సభ్యసమాజం సిగ్గుపడేలా ఉంది. సభలో గూండాగిరి, దౌర్జన్యం, రౌడీయిజం లేకుండా స్పీకర్ చర్యలు చేపట్టాలి. భారాస హయాంలో తీసుకొచ్చిన 'ధరణి' పోర్టల్ తప్పులతడకగా ఉందని కేసీఆర్‌కు తెలుసు. ఆయన 80వేల పుస్తకాలు చదివారు. పుస్తకాలను క్షుణ్ణంగా పరిశీలించి ధరణి పోర్టల్ రూపొందించారని అనుకునేవాళ్లం. ఆ చట్టానికి మూడేళ్లకే వందేళ్లు నిండాయి. ఇందిరమ్మ రాజ్యంలో 1971లో చేసిన చట్టం.. 49 ఏళ్లుగా ప్రజల్లో ఉంది. భూ భారతి బిల్లుకు సంబంధించి భారాస ఎమ్మెల్యే హరీశ్‌రావు అనేక సూచనలు ఇచ్చారు. ఈ బిల్లు సభలో ప్రవేశపెట్టినప్పుడు ప్రధాన ప్రతిపక్ష నేత కేసీఆర్ కూడా సూచనలు చేస్తారని ఆశించాం. అవి చట్టంలో పొందుపరచాలని భావించాం. కేసీఆర్ రాలేదు.. సభలో ఉన్నవాళ్లు ఈరకంగా గొడవ చేస్తున్నారు. భారాస చిల్లర వేషాలను ప్రజలు హర్షించరు' అని పొంగులేటి వ్యాఖ్యానించారు. అంతకుముందు హరీశ్‌రావు తీరుపై స్పీకర్ ప్రసాద్‌కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. భారాస సభ్యుల ఆందోళన సందర్భంగా స్పీకర్ మాట్లాడారు. 'హరీశ్‌రావు తీరు రాష్ట్ర ప్రజలకు తీరని అన్యాయం చేసేలా ఉంది. సభను తప్పుదోవ పట్టించడం సరికాదు. భూ భారతి ముఖ్యమైన బిల్లు. ప్రజలకు సంబంధించిన బిల్లులపై చర్చల సమయంలో ఇలా ప్రవర్తించడం సరికాదు. ఈ బిల్లు ఇష్టం లేదా? రైతులకు సాయం చేయడం ఇష్టం లేదా?'అని స్పీకర్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

## పశ్చిమగోదావరి జిల్లాలో కలకలం

పశ్చిమగోదావరి,పశ్చిమగోదావరి జిల్లాలో ఓ పార్సిల్ కలకలం సృష్టించింది. సాధారణంగా పార్సిల్‌లో ఏమైనా వస్తువులు వస్తాయి కానీ పశ్చిమగోదావరి జిల్లాలోని ఉండి మండలం గండిలో మాత్రం ఓ పార్సిల్‌లో మృతదేహం వచ్చింది. ఇది చూసిన వారు తీవ్ర భయాందోళలనకు గురయ్యారు. వివరాల్లోకి వెళ్తే.. గండిలో పార్సిల్‌గా ఓ వ్యక్తి డెడ్ బాడీ వచ్చింది. జగనన్న కాలనీలో ఇంటిని నిర్మిస్తున్న సాగి తులసి అనే మహిళకు ఈ పార్సిల్ వచ్చింది. ఇంటి సామగ్రితో పాటు పార్సిల్‌గా ఓ వ్యక్తి డెడ్‌బాడీ రావడంతో తీవ్ర సంచలనంగా మారింది. ఈ పార్సిల్ రాజమండ్రి క్షత్రియ పరిషత్ నుంచి వచ్చినట్లు సమాచారం.

## పాక్ కంటే బంగ్లాలోనే హిందువులపై ఎక్కువ హింస

బంగ్లాదేశ్, పాకిస్థాన్‌లలో హిందువులు, మైనారిటీ వర్గాలపై ఇటీవల దాడులు పెరుగుతున్న విషయం తెలిసిందే. ముఖ్యంగా షేక్ హసీనా ప్రభుత్వం పతనం తర్వాత వీటి సంఖ్య భారీగా చోటు చేసుకుంటున్నట్లు నివేదికలు వెల్లడిస్తున్నాయి. ఈ క్రమంలో బంగ్లాదేశ్‌లో హిందువులపై హింసాత్మక ఘటనలకు సంబంధించి ఈ ఒక్క ఏడాదిలోనే 2200 కేసులు నమోదైనట్లు భారత విదేశాంగ శాఖ పేర్కొంది. పాకిస్థాన్ లోనూ ఈ ఏడాది 112 కేసులు రికార్డయ్యాయని రాజ్యసభకు సమాచారం ఇచ్చింది. 'హింసాత్మక ఘటనలను భారత ప్రభుత్వం తీవ్రంగా పరిగణిస్తోంది. వీటిపై మన ఆందోళనను బంగ్లా ప్రభుత్వానికి వ్యక్తం చేశాం. హిందువులు, ఇతర మైనారిటీలకు భద్రత కల్పించేందుకు బంగ్లాదేశ్ అవసరమైన చర్యలన్నీ తీసుకుంటుందని ఆశిస్తున్నాం' అని భారత విదేశాంగ శాఖ వెల్లడించింది. దౌత్యమార్గాల ద్వారా ఆయా ప్రభుత్వాలతో తమ ఆందోళన తెలియజేశామని.. ఇటీవల బంగ్లాలో పర్యటించిన విదేశాంగ కార్యదర్శి కూడా ఇదే విషయాన్ని ఉద్ఘాటించారని పేర్కొంది. అటు మతపరమైన హింస, మైనారిటీ వర్గాలపై దాడులకు సంబంధించి చర్యలు తీసుకోవాలని పాకిస్థాన్‌కు కూడా విజ్ఞప్తి చేసినట్లు భారత విదేశాంగ వెల్లడించింది. అక్కడి మైనారిటీలపై జరుగుతున్న దారుణాల గురించి అంతర్జాతీయ వేదికలపై పాకిస్థాన్ తీరును ఎండగడుతూనే ఉన్నామని తెలిపింది. విదేశాంగ నివేదిక ప్రకారం.. హిందువులపై హింసాత్మక ఘటనలకు సంబంధించి బంగ్లాదేశ్‌లో 2022లో 47, 2023లో 302కేసులు నమోదయ్యాయి. ఈ ఏడాది డిసెంబర్ 8నాటికి ఏకంగా 2200 కేసులు రికార్డయ్యాయి. పాకిస్థాన్‌లో 2022లో 241 కేసులు, 2023లో 103, 2024లో 112 ఘటనలు చోటుచేసుకున్నాయి. ఈ రెండు దేశాలు మినహా మరే పొరుగు దేశంలో హిందువులపై హింసాత్మక దాడులు నమోదు కాలేదని కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. మరోవైపు భారత్‌లోని కొన్ని ప్రాంతాలను స్వాధీనం చేసుకోవాలంటూ బంగ్లాదేశ్‌లో కొందరు చేస్తున్న వాదనను భారత్ తీవ్రంగా ఖండించింది. బహిరంగ వ్యాఖ్యలు చేసేటప్పుడు జాగ్రత్తగా వ్యవహరించాలని స్పష్టం చేసింది. పొరుగుదేశ ప్రజలు, అక్కడి తాత్కాలిక ప్రభుత్వంతో సంబంధాలను పెంపొందించుకునేందుకు ఆసక్తి చూపిస్తున్నప్పటికీ.. బంగ్లా వైపు నుంచి ఈ తరహా చర్యలు నిరాశ కలిగిస్తున్నాయని విదేశాంగశాఖ పేర్కొంది.

## వణికించిన శీతాకాలం!

న్యూఢిల్లీ,పార్లమెంట్ శీతాకాల సమావేశాలు నిరవధికంగా శుక్రవారం వాయిదా పడ్డాయి. నవంబర్ 25 నుంచి ప్రారంభమైన ఈ సమావేశాల్లో బీజేపీ అనుకున్న విధంగా బిల్లులను అయితే పాస్ చేయించుకోలేక పోయింది అని అంటున్నారు. జమిలి ఎన్నికల బిల్లుని ఇదే పార్లమెంట్ లో చర్చకు పెట్టి ఆమోదించుకోవాలని అనుకున్నా విపక్షాల వ్యతిరేకత మధ్యన చివరిలోనే దానిని ప్రవేశపెట్టి జాయింట్ యాక్షన్ కమిటీ ముందుకు పంపించారు.అదే విధంగా వక్ఫ్ బోర్డు సవరణ బిల్లు చట్టం అవుతుందని శీతాకాల సమావేశాలే దానికి ముహూర్తం అని ప్రచారం సాగినా జేపీసీకి మరో మూడు నెలలు గడువు ఇచ్చి దీని మీద అధ్యయనాన్ని కొనసాగించడానికి వీలు కల్పించారు. ఇక పార్లమెంట్ లో రాజ్యాంగం ఆమోదించి 75 ఏళ్ళు పూర్తి అయిన సందర్భంగా చర్చ మాత్రం సాగింది.అయితే ఇక్కడ కూడా అధికార బీజేపీ విపక్ష ఇండియా కూటముల మధ్య విమర్శల జోరే కనిపించింది. రాజ్యాంగాన్ని ఎవరు గౌరవించారు, ఎవరు అవమానించారు అన్న దాని మీద ఒకరి మీద ఒకరు ఆరోపణలు చేసుకున్నారు.ఇక చూస్తే కనుక శీతాకాల సమావేశాలు ప్రారంభం అవుతూనే అదానీ మీద చర్యలకు డిమాండ్ చేస్తూ సభను స్థంభింప చేసేందుకు విపక్షాలు చూస్తూ వచ్చాయి. దాంతో సభ ప్రతీ రోజూ దాదాపుగా వాయిదా పడుతూనే వస్తోంది. పని గంటలు కూడా గతంతో పోలిస్తే ఈసారి తగ్గాయని అంటున్నారు.ఈసారి పార్లమెంట్ లో రాహుల్ గాంధీ పెద్దగా ఫోకస్ కాలేదు. ప్రియాంకా గాంధీ మొదటిసారి ఎంపీగా నెగ్గి సభకు రావడంతో ఆమె తన ఉనికి బలంగా చాటుకున్నారు. ముఖ్యంగా రాజ్యాంగం మీద చర్చలో ప్రియాంకా గాంధీ మంచి స్పీచ్ ఇచ్చారని ప్రశంసలు వచ్చాయి. అదే విధంగా మోడీ ప్రభుత్వం మీద ఆమె ధీటైన విమర్శలు చేశారు అని కూడా అంటున్నారు.ప్రధాని మోడీ ఈ సారి సమావేశాలలో రాజ్యాంగం మీద చర్చలోనే కీలకమైన ప్రసంగం చేశారు. అయితే గత సమావేశాలతో పోల్చితే ఈసారి మోడీ మార్క్ అయితే అంతగా కనిపించలేదు అనే అంటున్నారు. ఈసారి మొత్తం సమావేశాలలో హైలెట్ ఏంటి అంటే బీజేపీలో ఎన్డీయేలో కీలకమైన బలమైన నేతగా ఉన్న అమిత్ షాను ఇరుకున పెట్టడం. ఆయన అంబేద్కర్ మీద చేసిన వ్యాఖ్యలు అంటూ విపక్షాలు సభ లోపలా బయటా కూడా ఆందోళనలు చేశాయి. బహుశా ఈ ఆందోళనలు శీతాకాలం సమావేశాలు పూర్తి అయినా మరింత కాలం కొనసాగే అవకాశాలు అయితే ఉండొచ్చు.అమిత్ షా చేసిన వ్యాఖ్యలు ఒకటి అయితే వేరేగా చిత్రీకరించింది మరొటి అని బీజేపీ నేతలు అంటున్నారు. ఏది ఏమైనా మోడీ తరువాత అంతటి లీడర్ అయిన అమిత్ షా పదేళ్ళ పార్లమెంటరీ అనుభవం లో తొలిసారి విపక్షాలకు ఇలా దొరికి ఇబ్బంది పడ్డారు అని అంటున్నారు. మొత్తం మీద చూస్తే ఎన్డీయే ప్రభుత్వాన్ని అదాని ఇష్యూతో మొదలెట్టి అంబేద్కర్ ఇష్యూ దాకా లాగి విపక్షం అయితే వణికించింది అని విశ్లేషిస్తున్నారు.ఈసారి సమావేశాలలో అయితే బీజేపీ అనుకున్నది సాధించలేకపోయిందా అన్న చర్చ సాగుతోంది. విపక్షం మాత్రం తాము అదానీకి మోడీ సర్కార్ కి అండగా ఉందని ఎస్టాబ్లిష్ చేయగలిగామని అలాగే అంబేద్కర్ విషయంలో బీజేపీ మనువాద ధోరణిని ఎండగట్టామని సంతృప్తి వ్యక్తం చేస్తోంది.ఎవరు ఏమి అనుకున్నా ఈసారి శీతాకాల సమావేశాలు మాత్రం ప్రజా సమస్యల మీద పెద్దగా చర్చించలేదని అంటున్నారు. మేధావులు, రాజకీయ నిపుణులు పెదవి విరుస్తున్నారు. సభలలో రచ్చ రభస ఎక్కువ అవుతోందని, ఆఖరికి పార్లమెంట్ బయట బాహాబాహీ వంటి దృశ్యాలు కూడా గతంలో చూడనివి చోటు చేసుకుంటున్నాయని ప్రజాస్వామ్య ప్రియులు అయితే ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.అమరావతి: పశ్చిమ మధ్య- ఉన్న నైరుతి బంగాళాఖాతంలో తీవ్ర అల్పపీడనం కొనసాగుతోంది.

## నీటి సంఘాల ఎన్నికలు చెంపపెట్టు

అమరావతి,ఆరేళ్ల తర్వాత నిర్వహించిన సాగు నీటి సంఘాల ఎన్నికల్లో అన్నదాతలకు అఖండ విజయం చేకూరిందని మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. ఐదేళ్లపాటు నీటిపారుదల రంగాన్ని నిర్వీర్యం చేసిన జగన్, అయన పార్టీకి ఈ ఎన్నికలు ఒక చెంపపెట్టు లాంటివని వ్యాఖ్యానించారు.కూటమిలోని అన్ని పార్టీల ఐఖ్యతకు అన్నదాతలు ఏకపక్షంగా మద్దతు పలికారన్నారు. సాగు నీటి సంఘాల ద్వారా రైతులకు రైతు బిడ్డలే సేవ చేసుకునేలా దాదాపు 60 వేల మందికి సాగునీటి రంగంలో ప్రాతినిధ్యం కల్పించామని.. ఇదీ నిజమైన రైతు ప్రభుత్వం అని అన్నారు. నీటిపారుదల వ్యవస్థ మరింత బలపడేందుకు అన్నదాతలు ఎంతో దోహదపడతారని ఆకాంక్షించారు. మొన్నటి సాధారణ ఎన్నికల్లో 93 శాతం స్ట్రైక్‌రేట్‌తో గెలిస్తే, ఇప్పుడు జరిగిన సాగునీటి సంఘాల ఎన్నికల్లో 100 శాతం స్ట్రైక్‌రేట్‌తో ఏకగ్రీవంగా విజయం సాధించామన్నారు. రైతుల సహకారంతో రాబోయే రోజుల్లో సాగు నీటి రంగాన్ని బలోపేతం చేసి, ప్రతి ఏకరాకు నీరు అందించి సిరుల పంటలు పండిస్తామని మంత్రి వెల్లడించారు.

# పార్లమెంటరీ సంప్రదాయాలకేదీ మన్నన?



న్యూఢిల్లీ,పార్లమెంటు ఉభయ సభల్లోనూ, ఆవరణలోనూ గడచిన మూడు రోజులు చోటు చేసుకున్న సంఘటనలు సభ్యసమాజాన్ని విస్తుపోయేలా చేశాయంటే అతిశయోక్తి కాదు. అధికార, విపక్ష సభ్యుల ఆరోపణలు, ప్రత్యారోపణల మధ్య సభా కార్యకలాపాలకు తీవ్ర అంతరాయం కలగడమే కాదు, ఈ ఆందోళనలు శ్రుతిమించి పార్లమెంటు ప్రాంగణంలో సభ్యులు ఒకరినొకరు తోసుకోవడం, కొందరు గాయాలపాలు కావడం.. దరిమిలా పోలీసు స్టేషన్లకు వెళ్లి పరస్పరం కేసులు పెట్టుకోవడం ప్రజాస్వామికవాదులను కలవరానికి గురి చేసింది. అంతకుమించి, ఈ గలభాకు, అల్లర్లకు భారత రాజ్యాంగ నిర్మాత, ఆర్థికవేత్త, సంఘ సంస్కర్త డాక్టర్ బిఆర్ అంబేద్కర్‌ను కేంద్ర బిందువుగా చేసుకోవడం విచారకరం, గర్హనీయం.కేంద్ర హోంమంత్రి అమిత్ షా మంగళవారం రాజ్యసభలో మాట్లాడుతూ అంబేద్కర్ పేరును పదే పదే జపించే బదులు, దేవుడిని తలచుకున్నా ఏడేడు జన్మల స్వర్గప్రాప్తి లభించేదంటూ వ్యాఖ్యానించారని, ఇది అంబేద్కర్‌ను అవమానించడమేనని కాంగ్రెస్ సభ్యులు ఆ మరునాడు సభలో ధ్వజమెత్తారు. ఇందుకు అమిత్ షా క్షమాపణ చెప్పడంతోపాటు, రాజీనామా చేయాలని పట్టుబట్టడంతో గలభా మొదలైంది. హోం మంత్రి వ్యాఖ్యల తాలూకు వీడియోను సైతం కాంగ్రెస్ పార్టీ విడుదల చేసింది. అంతటితో ఆగని విపక్ష పార్టీలు దేశ వ్యాప్తంగా ఆందోళనలు నిర్వహించాయి. ప్రతిపక్ష సభ్యుల దాడిని అడ్డుకునేందుకు అధికారపక్ష సభ్యులు.. హోం మంత్రి ప్రసంగంలోని కొన్ని పదాలను మాత్రమే తీసుకుని కాంగ్రెస్ దేశాన్ని తప్పుదోవ పట్టిస్తోందంటూ ఎదురుదాడి మొదలుపెట్టడంతో పరిస్థితి వేడెక్కింది.తాను అంబేద్కర్‌ను అవమానించలేదని, ఆయన పట్ల తనకూ, తమ పార్టీకీ ఎంతో గౌరవముందనీ అమిత్ షా స్పష్టం చేసినా, ప్రధాని సైతం జోక్యం చేసుకుని అంబేద్కర్ పట్ల తమకున్న గౌరవప్రపత్తులను వెల్లడించినా ఆందోళనలు ఆగలేదు. ఈ నేపథ్యంలో గతంలో అంబేద్కర్ పట్ల కాంగ్రెస్ వ్యవహరించిన తీరును ప్రధాని సహా ఎన్‌డిఎ సభ్యులు సోదాహరణంగా ఏకరవు పెట్టడం మొదలుపెట్టడంతో రెండు రోజులుగా ఉభయ సభలూ స్తంభించిపోయాయి. దీనికి కొసమెరుపుగా, పార్లమెంటు ఆవరణలో జరిగిన గలభా, తోపులాట ప్రజాస్వామ్యానికే తలవంపులు తెచ్చిపెట్టేదిలా ఉంది. ఈ సంఘటనలో ఇద్దరు బిజెపి ఎంపిలు గాయపడి ఆస్పత్రి పాలుకాగా, తోపులాటలో తాను కిందపడి గాయపడ్డానంటూ కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే చెప్పుకొచ్చారు. లోక్‌సభలో విపక్ష నేతపై అధికారపక్ష సభ్యులు హత్యాయత్నం కేసు పెట్టడం, ప్రతిగా తమ పార్టీ అధ్యక్షుడిపై అనుచితంగా ప్రవర్తించారంటూ కాంగ్రెస్ సభ్యులు సైతం కేసు పెట్టడం పరిస్థితి తీవ్రతను తెలియజేస్తోంది.పార్లమెంటు సాక్షిగా గత కొన్ని రోజులుగా జరిగిన పరిణామాలు భారత ప్రజాస్వామ్య వ్యవస్థ ప్రతిష్ఠను మసకబారేలా చేశాయనడంలో సందేహం లేదు. డాక్టర్ అంబేద్కర్ కేంద్రంగా సాగుతున్న ఈ గలభా, అల్లర్లు ఆయనకూ, ఆయన ఆశయాలకూ మచ్చతెచ్చేవే. తన సుదీర్ఘమైన రాజకీయ ప్రస్థానంలో అంబేద్కర్ కాంగ్రెస్ సహా అన్ని రాజకీయ పక్షాల ఏకపక్ష, స్వార్థపూరిత, దళిత వ్యతిరేక, కులపక్షపాత ధోరణులను ఎండగడుతూనే వచ్చారు. ఈ విషయంలో ఆయన పార్టీలపరంగా ఎలాంటి సానుకూల ధోరణినీ కనబరచలేదు. ఒక పార్టీకి ఆయన దగ్గరని కానీ, మరొక పార్టీకి దూరమని గానీ చెప్పలేం. అలాంటిది, ఆయన మరణానంతరం అంబేద్కర్ సిద్ధాంతాలనూ, ఆశయాలను అన్ని పార్టీలూ అందిపుచ్చుకుని, వాటి సాధన కోసం కృషి చేస్తున్నామని, దళిత బడుగు బలహీన వర్గాల ఉద్ధరణ కోసం పాటు పడుతున్నామని చెప్పుకోవడం చూస్తూనే ఉన్నాం. ప్రధాన రాజకీయ పక్షాలైన కాంగ్రెస్, భారతీయ జనతా పార్టీలూ ఇందుకు మినహాయింపేమీ కాదు.వాడవాడలా అంబేద్కర్ విగ్రహాలను నెలకొల్పి, ఆయన జయంతి, వర్ధంతుల నాడు పూలదండలతో ముంచెత్తినంత మాత్రాన ఆ మహనీయుడి ఆశయ సాధన సిద్ధించినట్లేనని భావిస్తే అంతకన్నా హాస్యాస్పదమైన విషయం మరొకటి ఉండదు. ఉన్నతమైన చర్చలతో, పటుతరమైన చట్టాలకు రూపకల్పన చేసే వేదికలుగా చట్టసభలు ఉండాలని ఆయన ఆకాంక్షించారు. ఈ విషయాన్ని విస్మరించి, సభా సాంప్రదాయాలను మంటగలుపుతూ, ఒకరిపై ఒకరు దాడులకు పాల్పడుతూ, ఉన్నత స్థానంలో ఉన్న స్పీకర్‌ను అగౌరవపరుస్తూ అంబేద్కర్ ఆశయాలకు మచ్చతెచ్చేలా ప్రవర్తిస్తున్న సభ్యుల ప్రవర్తనలో మార్పు రావాలి. ప్రజాప్రతినిధులు హుందాగా, సభ్యతతో వ్యవహరించినప్పుడే ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించే వేదికలుగా చట్టసభలకు శోభ చేకూరుతుంది. నూటనలభై కోట్ల భారతీయుల ఆశలు, ఆకాంక్షలకూ ప్రతిరూపమైన పార్లమెంటు ప్రతిష్ఠను నిలబెట్టడం సభ్యుల బాధ్యత. సంకుచిత రాజకీయాలను పక్కనబెట్టి, ప్రభుత్వమూ, ప్రతిపక్షమూ సమన్వయంతో ముందుకు సాగాల్సిన అవసరం ఏర్పడుతుంది.

# బీటలు వారుతున్న వివాహ వ్యవస్థ

న్యూఢిల్లీ,విడాకుల తర్వాత భర్త నుంచి భార్య పొందే భరణానికి సంబంధించిన నిబంధనలు భార్య సంక్షేమానికి ఉద్దేశించినవే తప్ప భర్తను భయపెట్టేందుకో, శిక్షించేందుకో లేక దోపిడీ చేసేందుకో ఉద్దేశించినవి కావంటూ సుప్రీం కోర్టు తాజాగా చేసిన వ్యాఖ్యలు ఎన్నదగినవి. భార్యా బాధితులకు ఊరటనిచ్చేవి కూడా. తన భర్త సంపదకు తగినట్లుగా తనకు భరణం ఇప్పించాలంటూ కేసు వేసిన ఓ గృహిణిని సర్వోన్నత న్యాయస్థానం మందలిస్తూ, ఒకవేళ విడాకులు తీసుకున్నాక భర్త ఆర్థిక పరిస్థితి దిగజారితే బాధ్యత తీసుకుంటారా? అని ప్రశ్నించడం సహేతుకమే. భర్త, అత్తింటివారినుంచి డబ్బు వసూలు చేయాలన్న లక్ష్యంతోనే ఇలాంటి తీవ్రమైన ఆరోపణలతో కేసులు పెడుతున్నారని కూడా ఈ సందర్భంగా సుప్రీం కోర్టు ధర్మాసనం వ్యాఖ్యానించడం గమనార్హం. మనోవర్తి అనేది రాజ్యాంగపరంగా సంక్రమించిన హక్కే కాదు, మానవ హక్కుల్లో అది ఒక భాగమని గతంలోనూ సుప్రీం కోర్టు స్పష్టం చేసింది. రాజ్యాంగంలో పొందుపరిచిన ప్రత్యేక వివాహ చట్టం, హిందూ వివాహ చట్టం, నేర న్యాయస్మృతి వంటివి మనోవర్తికి సంబంధించిన అంశాలను వివరిస్తున్నాయి. ఈ చట్టాలలోని లొసుగులను ఆధారం చేసుకుని భర్తనుంచి ఎక్కువ డబ్బు గుంజాలనుకునే మహిళలకు తాజా తీర్పు చెంపపెట్టులాంటిదే. గృహహింస నిరోధక చట్టమూ ఇలాంటి ఒడిదుడుకులను ఎదుర్కొంటోంది. తమను రాచిరంపాన పెట్టే భర్తలనుంచి, అత్తమామలనుంచి గృహిణులకు రక్షణ కల్పించే ఉద్దేశంతో 2005లో అమలులోకి వచ్చిన ఈ చట్టం కొందరు మహిళలకు పెట్టనికోటలా మారింది. అత్తమామల్ని, భర్తనూ వేధించేందుకు ఈ చట్టం కొందరికి ఆయుధంగా మారుతోందని పలు సందర్భాల్లో న్యాయస్థానాలు ఆందోళన వ్యక్తం చేశాయి. వివాహిత స్త్రీలకు గృహహింస నుంచి రక్షణ కల్పించేందుకు ఉద్దేశించిన సెక్షన్ 498ఎ దుర్వినియోగమవుతోందంటూ గతంలో కలకత్తా హైకోర్టు వ్యాఖ్యానించింది. భర్తతో విభేదించిన మహిళలు అతని తరపు బంధువులందరినీ నిందితులుగా చూపుతున్నారంటూ బాంబే హైకోర్టు ఒక సందర్భంలో అసహనం వ్యక్తం చేసింది. మరో కేసులో అలహాబాద్ హైకోర్టు తీర్పు చెబుతూ పెళ్లికి సంబంధించిన ప్రతి కేసునూ వరకట్న వేధింపుల ఆరోపణలతో పెద్దదిగా చూపేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయంటూ పేర్కొంది. అంతెందుకు, బెంగళూరుకు చెందిన ఓ టెకీ ఆత్మహత్య ఇటీవల దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. చనిపోయేముందు 80 నిమిషాల సేపు ఆయన చిత్రీకరించిన వీడియోలోనూ, 40 పేజీల సుదీర్ఘ లేఖలోనూ తన భార్య పెడుతున్న చిత్రహింసల గురించి వివరించిన తీరు మానవతావాదుల హృదయాలను ద్రవీభవింపజేసిందంటే అతిశయోక్తి కాదు. ఈ కేసు విషయంలో సుప్రీం కోర్టు%ఔ% వరకట్నం వేధింపుల చట్టాలు దుర్వినియోగమవుతున్నాయనీ, ఇలాంటి కేసుల విచారణలో జాగ్రత్తగా వ్యవహరించాలని న్యాయస్థానాలకు హెచ్చరికలు జారీ చేసింది. ఇదే సందర్భంలో విడాకుల తర్వాత భార్యకు ఎంత



భరణం ఇవ్వాలో లెక్కించేందుకు ఎనిమిది అంశాలతో మార్గదర్శక సూత్రాలను కూడా జారీ చేసింది. ఒకప్పుడు ఉద్యోగం పురుష లక్షణం అనేవారు. ఇప్పుడు ఆ నానుడికి కాలం చెల్లింది. గతంలో వంటింటి కుందేళ్లుగా ఉన్న మహిళలు ఇప్పుడు పురుషులతో సమానంగా విద్య, ఉద్యోగ అవకాశాలను అందిపుచ్చుకుంటున్నారు. పురుషాధిక్య ప్రపంచపు కోటలను బద్దలు కొట్టి అన్ని రంగాలలోనూ దూసుకుపోతున్నారు. మంచిదే, అయితే, కాపురాన్ని ముందుకు నడిపించేవి దంపతులు మధ్య ప్రేమాభిమానాలు, ఆప్యాయతానురాగాలే తప్ప, ఒకరిపై ఒకరు చూపే ఆధిపత్య ధోరణులు ఎంతమాత్రం కాదు. పవిత్రమైన హిందూ వివాహ వ్యవస్థ ఇటీవల పలుమార్లు కాలపరీక్షకు లోనవుతోంది. వివాహంపైనా, జీవితంపైనా సరైన అవగాహన లేని దంపతులు చిన్నాచితకా వివాదాలను కూడా భూతద్దంలోంచి చూస్తూ విడాకుల కోసం కోర్టుకు ఎక్కుతున్నారు. ఒకప్పుడు కాపురాల్లో కలతలు రేగితే పెద్దలు జోక్యం చేసుకుని సర్దిచెప్పేవారు. ఇప్పుడు పరిస్థితిలో మార్పు వచ్చింది. పిల్లలు విడాకులు తీసుకోవాలనుకుంటే సర్దిచెప్పడం అలా ఉంచి, పెద్దలే దగ్గరుండి విడాకులు ఇప్పించే పరిస్థితులు దాపురించాయి. మరోవైపు, వివాహ వ్యవస్థ ఒడిదుడుకులకు లోనవుతున్న విషయాన్ని గమనిస్తున్న యువతీయువకులు పెళ్లిని కాదని, సహజీవనం వైపు మొగ్గుచూపుతున్నారు. దీని వల్ల భారతీయ వివాహ వ్యవస్థ ఉనికే ప్రమాదంలో పడుతోంది. గృహహింస, మనోవర్తి చట్టాలు దుర్వినియోగవ ుతున్నంత మాత్రాన వాటిని రద్దు చేయాలనే వాదనలు ఎంతమాత్రం సహేతుకం కాదు. ఇప్పటికీ సమాజంలో మహిళలపట్ల వివక్ష కొనసాగుతూనే ఉంది. గృహహింసకు లోనవుతూనే ఉన్నారు. కాబట్టి, వారికి రక్షణగా రూపొందిన చట్టాలలోని లొసుగులను పరిహరించే ప్రయత్నం జరగాలి. వాటిని ఆసరా చేసుకుని భర్తలను, అత్తమామలను వేధించాలనుకునే మహిళల భరతం పట్టేలా చట్టాలను పటుతరంగా రూపొందించాలి. లేనిపక్షంలో పవిత్రమైన వివాహ వ్యవస్థ నాశనమయ్యే ప్రమాదం లేకపోలేదు.

# మహిళలకు ఉచిత బస్సు పథకంపై కసరత్తు

అమరావతి, ఏపీ ఎన్నికల సమయంలో ఎన్‌డీఏ కూటమి ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ పథకం ఒకటి. దాంతో ఈ స్కీమ్ అమలు ఎప్పుడెప్పుడా అని మహిళలు ఎంతో ఆత్రుతగా ఎదురుచూస్తున్నారు. తాజాగా ఈ పథకానికి సంబంధించి రాష్ట్ర సర్కార్ కీలక నిర్ణయం తీసుకుంది. ఈ పథకం అమలు తీరుతెన్నుల పరిశీలనకై ప్రభుత్వం కేబినెట్ సబ్ కమిటీని ఏర్పాటు చేసింది. ముగ్గురు మంత్రులతో ఈ సబ్ కమిటీని ఏర్పాటు చేస్తూ ఈరోజు ఉత్తర్వులు జారీ చేసింది. రవాణా, మహిళా–శిశు సంక్షేమ, హోం శాఖల మంత్రులు ఇందులో సభ్యులుగా ఉంటారని తెలిపింది. ఇతర రాష్ట్రాల్లో ఈ పథకం ఎలా అమలు అవుతోంది, అక్కడి విధివిధానాలు, ఏపీలో ఎలా అమలు చేస్తే బాగుంటుంది తదితర విషయాలపై మంత్రుల కమిటీ వీలైనంత త్వరగా నివేదికను, సూచనలను ఇవ్వాలని ఉత్తర్వుల్లో పేర్కొనడం జరిగింది. సబ్ కమిటీ నివేదిక ఆధారంగా ఏపీలో ఈ పథకం అమలు కానుంది. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం విషయంలో కొంత ఆలస్యమైనా, సమగ్ర విధానాన్ని అమలు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఇటీవల అధికారులను ఆదేశించారు. ఆర్థిక సంవత్సరంలోనే మహిళలకు ఉచిత బస్సు పథకం ప్రారంభించేందుకు ప్రయత్నిస్తున్నట్లు, మంత్రి కొలుసు పార్థసారథి స్పష్టం చేశారు. దీంతో అధికారులు సమగ్ర నివేదికను రూపొందించారు. మహిళలకు ఉచితబస్సు ప్రయాణం అమలు కోసం.. అదనంగా 2 వేల బస్సులు, 3 వేల 500 మంది డ్రైవర్లు అవసరమని.. అధికారుల కమిటీ నివేదికలో పేర్కొంది. ప్రతి నెలా ఆర్టీసీ 250 నుంచి 260 కోట్ల రూపాయలు ఇవ్వాల్సి ఉంటుందని స్పష్టం చేసింది. మహిళలకు బస్సుల్లో ఉచిత ప్రయాణ సేవలు ప్రారంభించేందుకు రంగం సిద్ధం అవుతోందని.. టీడీపీ నేతలు చాలా రోజులుగా చెబుతున్నారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన ముఖ్యమైన హామీలలో ఆర్టీసీ బస్సుల్లో ఉచిత బస్సు ప్రయాణం కూడా ఒకటి. దీనిపై ప్రకటన ఎప్పుడు వస్తుందా అని మహిళలు, యువతులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఇటీవలే సీఎంగా నాలుగోసారి బాధ్యతలు తీసుకున్న చంద్రబాబు.

# కువైట్ ఓ మినీ ఇండియా

కువైట్,పశ్చిమాసియా దేశమైన కువైట్ లో ఇంత మంది భారతీయులను చూడటం చాలా ఆనందంగా ఉందని, ఇదో 'మినీ ఇండియా' లా కనిపిస్తోందని ప్రధాని మోదీ అన్నారు. రెండు రోజుల కువైట్ పర్యటనకు వెళ్లిన ప్రధాని.. అక్కడి ప్రవాస భారతీయులతో నిర్వహించిన 'హలా మోదీ' కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మీ అందరికీ భారత్ నుంచి ఇక్కడికి రావడానికి 4 గంటల సమయం పడితే.. ఓ భారత ప్రధాని ఇక్కడికి రావడానికి 4 దశాబ్దాల సమయం పట్టిందన్నారు. ప్రతి ఏటా వందలాది మంది భారతీయులు ఇక్కడికి వస్తున్నారని, అలా కువైట్ సమాజానికి భారతీయతను పరిచయం చేశారని మోదీ అన్నారు. భారతదేశ ప్రతిభ, సాంకేతికత, సంప్రదాయాలను మేళవించి కువైట్ నేలను భారతీయ నైపుణ్య రంగులతో నింపారని ప్రశంసించారు. ఈ దేశ వైద్యరంగానికి భారతీయ వైద్యులు, పారామెడికోలే ప్రధాన బలమన్నారు. 'కువైట్ భవిష్యత్ తరాలను తీర్చిదిద్దడంలో భారతీయ ఉపాధ్యాయుల పాత్ర కీలకంగా మారింది. ఈ దేశ నేతలతో ఎప్పుడు మాట్లాడినా భారతీయుల గురించి ప్రశంసిస్తూనే ఉంటారు. రెమిటెన్స్‌లను (విదేశీ కరెన్సీ) స్వీకరించడంలో భారత్ ప్రపంచంలోనే అగ్రగామిగా ఉంది. మీరంతా కష్టపడి పని చేయడం వల్లే ఈ ఘనత సాధ్యమైంది. భారత్, కువైట్ దేశాలు అరేబియా సముద్రానికి ఇరువైపులా ఉన్నాయి. ఈ రెండు దేశాలను కేవలం దౌత్యసంబంధాలే కలపడం లేదు. హృదయ సంబంధాలు కూడా దగ్గర చేస్తున్నాయి. ఇప్పుడే కాదు.. గతంలోనూ రెండు దేశాల మధ్య సంబంధాలు బాగుండేవి. కువైట్‌కు అవసరమైన మానవ వనరులు, నైపుణ్యత, సాంకేతికతను అందించడం లో భారత్ ముందంజలో ఉంది. రాబోయే కాలంలో ఈ రెండు దేశాలు కేవలం వాణిజ్యపరంగానే కాకుండా పరస్పర శ్రేయస్సు కోరుకునే భాగస్వాములు కూడా అవుతాయి. భారతదేశంలోని స్టార్టప్‌లు, సాంకేతిక కువైట్ అవసరాలకు అత్యాధునిక పరిష్కారాలను చూపించగలవు' అని మోదీ అన్నారు. కొవిడ్ –19 మహమ్మారి సమయంలో భారత్‌కు లిక్విడ్ ఆక్సిజన్‌ను సరఫరా చేసిన కువైట్ ప్రభుత్వానికి ఈ సందర్భంగా మోదీ కృతజ్ఞతలు తెలిపారు.

# దక్షిణాదిలో ఎన్డీయే విస్తరణ..

హైదరాబాద్,దక్షిణాదిన కూడా ఎన్డీయే అధికారంలోకి వచ్చేందుకు అవసరైన చర్యలకోసం ప్రత్యేక టీం నియమించినట్లు తెలుస్తోందిఏ రాజకీయ పార్టీకి అయినా అధికారమే అంతిమ లక్ష్యం. స్వయంగా అధికారపగ్గాలు చేపట్టాలనుకుంటుంది. అయితే ఒక్కోసారి అది సాధ్యం కాదని భావించినప్పుడు ఇతర పార్టీలతో కలిసి పోటీ చేసి అధికారాన్ని కైవసం చేసుకుంటూ ఉంటుంది. వరుసగా కేంద్రంలో మూడోసారి అధికారంలోకి వచ్చిన బీజేపీ ఉత్తరాదిలో తన హవా కొనసాగించగలుగుతోంది. కానీ దక్షిణ భారతదేశంలో మాత్రం బీజేపీ పప్పులు ఉడకట్లేదు. అందుకే ఒక ప్రత్యేక యాక్షన్ ప్లాన్ సిద్ధం చేసినట్లు వార్తలొస్తున్నాయి. దక్షిణాదిన కూడా ఎన్డీయే అధికారంలోకి వచ్చేందుకు అవసరైన చర్యలకోసం ప్రత్యేక టీం నియమించినట్లు తెలుస్తోంది.దక్షిణాదిలో బీజేపీ పాగా వేయాలని ఎప్పటినుంచో ఆలోచిస్తోంది. అయితే ఒక్క కర్నాటక మినహా మిగిలిన రాష్ట్రాల్లో బీజేపీకి కాలం కలిసి రావట్లేదు. కర్నాటక తర్వాత ఒక్క తెలంగాణలో మాత్రమే ఆ పార్టీకి మంచి ఓట్ బ్యాంకు ఉంది. ఆంధ్రప్రదేశ్, తమిళనాడు కేరళలో కమలం పార్టీ ప్రభావం నిర్ణయాత్మక స్థాయిలో లేదని చెప్పొచ్చు. ఆంధ్రప్రదేశ్ లో టీడీపీ, జనసేనతో పొత్తు వల్ల అధికారంలో భాగస్వామి అవగలిగింది. అక్కడ కూడా ఆ పార్టీ ఒంటరిగా పోటీ చేస్తే ఒక్క సీటు కూడా దక్కించుకుంటుందనే నమ్మకం లేదు. పొత్తులో ఉన్నప్పుడు మాత్రమే ఏపీలో బీజేపీ కాస్తోకూస్తో సీట్లు గెలుచుకోగలిగింది.అయితే బీజేపీ ఇప్పుడు దక్షిణాదిపై స్పెషల్ ఫోకస్ పెట్టినట్లు అర్థమవుతోంది. ఒంటరిగా అధికారంలోకి రాలేకపోయినా ఇతర పార్టీలతో కలిసి అధికారాన్ని కైవసం చేసుకునేలా వ్యూహరచన చేస్తోంది. ఇందుకు ఎలా ముందుకెళ్తే బాగుంటుందో అధ్యయనం చేయాలంటూ ఓ ప్రత్యేక బృందాన్ని బీజేపీ హైకమాండ్ నియమించినట్లు తెలుస్తోంది. కేంద్ర మంత్రులు ధర్మేంద్ర ప్రదాన్, భూపేంద్ర యాదవ్, రామ్మోహన్ నాయుడితో కూడిన ఈ బృందానికి బీజేపీ అధ్యక్షుడు జేపీ నడ్డా నేతృత్వం వహిస్తారు. అంతేకాక.. రాష్ట్రాల వారీగా తీసుకోవాల్సిన నిర్ణయాలు, అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించేందుకు అంతర్గత కమిటీలను కూడా నియమించినట్లు తెలుస్తోంది.ఈ మొత్తం వ్యవహారంలో చంద్రబాబునాయుడు కీలక పాత్ర పోషిస్తున్నట్టు సమాచారం. మోదీ, అమిత్ షా, నడ్డా ఎప్పటికప్పుడు చంద్రబాబుతో చర్చిస్తూ నిర్ణయాలు తీసుకుంటున్నట్టు తెలుస్తోంది. రాష్ట్రాల వారీగా కీలక నేతలు, చేపట్టాల్సిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ఆయా కమిటీలు ఎప్పటికప్పుడు అధ్యయనం చేస్తున్నాయి. మంత్రులస్థాయి బృందం వీటిని ప్రయారిటీగా తీసుకుని క్లియర్ చేస్తోంది. అంతకుముందు వీటిని చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి ఒపీనియన్ తీసుకుంటున్నట్టు సమాచారం. ఏపీతో పాటు మిగిలిన రాష్ట్రాల్లో ఎన్డీయే భాగస్వామ్య పార్టీలను సమన్వయం చేసుకుంటూ అధికారంలోకి వచ్చేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకునేందుకు చంద్రబాబును ప్రధాన భాగస్వామిగా బీజేపీ పరిగణిస్తున్నట్టు న్యూఢిల్లీ వర్గాలు చెప్తున్న మాట.

# చెక్ పెట్టబోతున్నారా?

అమరావతి,వైసీపీ అధినేత జగన్ ఆట మొదలుపెట్టారా..? తన మార్క్ రాజకీయాన్ని చూపించబోతున్నారా.. వ్యక్తిగత ఆరోపణలు చేస్తున్న చెల్లికి ఎలా చెక్ పెట్టబోతున్నారు? ఖాళీ అవుతున్న పార్టీకి ఏ విధంగా నిండుతనం తీసుకురాబోతున్నారు? అసలు జగన్ ప్లాన్ ఏంటి? ఢిల్లీ కేంద్రంగా ఆయన ఏం చేయబోతున్నారు?

పార్టీని బలోపేతం చేసేందుకు, క్యాడర్‌లో జోష్ నింపేందుకు సరికొత్త వ్యూహం..

ఏపీ రాజకీయాలు ట్విస్ట్‌లతో ఎప్పుడూ ఆసక్తిగానే ఉంటాయి. కూటమి ప్రభుత్వం జగన్‌ను టార్గెట్ చేస్తూ వ్యూహాలు అమలు చేస్తోంది. ఇటు పీసీసీ చీఫ్ షర్మిల సైతం జగన్ లక్ష్యంగా వ్యక్తిగత ఆరోపణలు చేస్తున్నారు. ఇంకోవైపు ముఖ్యనేతలంతా వైసీపీని వీడుతున్నారు. మొత్తానికి వైసీపీకి గడ్డు రోజులు నడుస్తున్నాయి అనుకునేలా ఉంది పొలిటికల్ సిచ్యువేషన్.. ఇలాంటి టైమ్‌లో వైఎస్ జగన్ తన మార్క్ రాజకీయం మొదలుపెట్టబోతున్నారని సమాచారం. పార్టీని బలోపేతం చేసేందుకు, క్యాడర్‌లో జోష్ నింపేందుకు సరికొత్త వ్యూహంతో వస్తున్నారంట ఆయన.

పీసీసీ చీఫ్ సీటు నుంచి షర్మిలను తప్పించేందుకు జగన్ స్కెచ్?

ఓ వైపు జిల్లాల పర్యటనలకు ప్లాన్ చేస్తూనే.. మరోవైపు పొలిటికల్ గేమ్‌కు తెరతీశారు జగన్. పీసీసీ చీఫ్ సీటు నుంచి షర్మిలను తప్పించేందుకు జగన్ స్కెచ్ వేసినట్లు పొలిటికల్ సర్కిళ్లలో టాక్ వినిపిస్తోంది. బెంగళూరులో ఉంటూనే ఢిల్లీ కేంద్రంగా పావులు కదుపుతున్నారట. కూటమి నేతలతో పాటు షర్మిల ప్రతీ సందర్భంలోనూ జగన్‌ను టార్గెట్ చేస్తున్నారు. దీంతో కూటమి నేతలతో పాటు షర్మిలకు కూడా చెక్ పెట్టాలని జగన్ డిసైడ్ అయినట్లు కనిపిస్తున్నారు.ఇప్పటికే షర్మిల నాయకత్వంపై కాంగ్రెస్ సీనియర్లు వ్యతిరేక స్వరం వినిపిస్తున్నారు. పార్టీ బలోపేతాన్ని గాలికి వదిలేసి.. కుటుంబ ఆస్తుల లొల్లినే పట్టుకున్నారని కాంగ్రెస్ నేతలు బహిరంగానే చర్చించుకుంటున్నారు. కూటమి ప్రభుత్వంపై కాకుండా జగన్‌పై వ్యక్తిగత విమర్శలకే ప్రాధాన్యత

# అమిత్ షాను మంత్రి వర్గం నుండి బర్తరఫ్ చేయాలి



అచ్చంపేట,భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ పై కేంద్రమంత్రి అమిత్ షా రాజ్యసభలో చేసిన అనుచిత వ్యాఖ్యలను కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తుందని అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ అన్నారు. అచ్చంపేట పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీసులో నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ..ఎన్నికలకు ముందు లబ్ధి పొందడానికి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ను కీర్తించిన బిజెపి అధికారంలోకి వచ్చిన వెంటనే అహంకారపూరితంగా దైవంగా పూజింపబడే అంబేద్కర్ను విమర్శించడాన్ని భారతదేశంలోని యావత్ ప్రజానీకం అసహ్యించుకుంటున్నారని అన్నారు.బిజెపి పాలనలో ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, మహిళలకు రక్షణ కరువైందని, సెక్యులర్ దేశమైన భారతదేశంలో మత ప్రాతిపదికన చిచ్చులు పెడుతుందని, ఈశాన్య రాష్ట్రాలలో ముఖ్యంగా మణిపూర్లో మైనార్టీ, క్రిస్టియన్ ల పై ఆటవికంగా నట్ట నడిరోడ్డుపై వారి హక్కులను కాలరాస్తూ వారిపై జరుగుతున్న పైశాచిక దాడులే సాక్ష్యమని వివరించారు.నాటి ఇందిరా గాంధీ నుండి నేటి సోనియా గాంధీ వరకు కాంగ్రెస్ పార్టీ సెక్యులరిజాన్ని పాటిస్తూ అందరి పక్షాన నిలుస్తూ గౌరవిస్తుందని అన్నారు. డాక్టర్ అంబేద్కర్ పై బిజెపి మంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలకు నిరసనగా పిసిసి ఆదేశాల మేరకు సోమవారం అచ్చంపేట పట్టణంలో భారీ నిరసన ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు.ఇట్టి ర్యాలీకి నాగర్ కర్నూల్ పార్లమెంటు సభ్యులు డాక్టర్ మల్లురవి, తెలంగాణ రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్సీ కూచుకుల దామోదర్ రెడ్డి, ఎమ్మెల్యేలు రాజేశ్వర్ రెడ్డి, నారాయణరెడ్డి, మెగా రెడ్డి తదితరులు హాజరవుతున్నందున కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, పార్టీ అనుబంధ సంఘాల నాయకులు, ప్రజా ప్రతినిధులు, ప్రజాస్వామ్యవాదులు పెద్ద సంఖ్యలో పాల్గొని నిరసన ర్యాలీని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# సీనియర్లకు గ్రీన్ సిగ్నల్ ఇస్తున్న జగన్!



అమరావతి,వైసీపీ అధినేత జగన్ తన రాజకీయ వ్యూహాలను మారుస్తున్నారు. 2027లో ఎన్నికలు జరిగినా లేక 2029లో జరిగినా కూడా కొత్త టీం తోనే ఎన్నికలకు వెళ్లాలని చూస్తున్నారు అని అంటున్నారు. ప్రస్తుతం పార్టీలో ఉన్న సీనియర్లను వారి అనుభవాలను వాడుకుంటూనే కొత్త వారికి యంగ్ లీడర్స్ కి చాన్స్ ఇవ్వాలని చూస్తున్నారు అని అంటున్నారుఆ విధంగా సీనియర్ నేతలు కూడా జగన్ కి వినతి చేస్తున్నారు అని అంటున్నారు. తమ వారసులకు టికెట్ ఇస్తే తాము వెనక ఉండి రాజకీయ శిక్షణ ఇస్తామని గెలిపించుకుంటామని చెబుతున్నారు. నిజానికి 2024లోనే ఇదంతా జరగాలి. కానీ జగన్ ఒప్పుకోలేదు. ఇపుడు అది సాకారం అవుతోంది అంటున్నారు.శ్రీకాకుళం నుంచే దానికి శ్రీకారం చుడుతున్నారు అని అంటున్నారు. ధర్మాన బ్రదర్స్ ఇద్దరూ రాజకీయాల నుంచి తప్పుకుని తమ వారసులను రంగంలోకి దించుతారు అని అంటున్నారు. దానికి జగన్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చారని అంటున్నారు. శ్రీకాకుళం సీటులో ధర్మాన ప్రసాదరావు తన కుమారుడు రాం మనోహర్ నాయుడిని ముందుకు తెస్తున్నారు.అలాగే నరసన్నపేట నుంచి తన కుమారుడు క్రిష్ణ చైతన్యను ధర్మాన క్రిష్ణ దాస్ ముందుకు తెస్తున్నారు. వీరికే పార్టీ బాధ్యతలు తొందరలో అప్పగిస్తారు అని అంటున్నారు. అలాగే పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి కుమారుడిని రంగంలోకి తీసుకుని రావాలని చూస్తున్నారు.మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం కుమారుడి కోసం కూడా ప్రయత్నాలు జరుగుతున్నాయని అంటున్నారు. విజయనగరంలో బొత్స సత్యనారాయణ కుమారుడికి చీపురుపల్లి బాధ్యతలు ఇస్తారని అంటున్నారు. విజయనగరంలో మాజీ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి కుమార్తె శ్రావణికి ఇన్చార్జి బాధ్యతలు ఇస్తారా అన్న చర్చ కూడా ఉంది.అలాగే బొబ్బిలి, సాలూరులలో కూడా కొత్త ముఖాలను తెస్తారని అంటున్నారు. విశాఖలో చూసినా సీనియర్ నేతల స్థానంలో కొత్త వారికి లేదా వారసులకు అవకాశం ఇస్తారని అంటున్నారు. అయితే సీనియర్లు పార్టీ కోసం పనిచేయాలని అధినాయకత్వం సూచించే అవకాశం ఉంది అని అంటున్నారు అందుకే భూమన కరుణాకరరెడ్డి, పేర్ని నాని వంటి వారు గట్టిగా పనిచేస్తున్నారని చెబుతున్నారు. ఇదే విధంగా మరింత మంది సీనియర్ నేతలకు కూడా వారసుల విషయంలో గ్రీన్ సిగ్నల్ లభించినట్లుగా చెబుతున్నారు. మొత్తానికి బలంగా సీనియర్లు ఉన్న చోట వారసులను దించడం, లేని చోట కొత్త వారికి చాన్స్ ఇవ్వడం ద్వారా వైసీపీ పార్టీకి కొత్త నెత్తురు ఎక్కించాలని చూస్తోంది అంటున్నారు. మరి ఈ ప్రయోగం ఏ మేరకు ఫలిస్తుందో చూడాల్సి ఉందని అంటున్నారు.

# తిరుమల విజన్-2047 పై ఈవో సమీక్ష!



అమరావతి,గత ఆరు నెలల్లో తిరుమలలో అనేక మార్పులు తీసుకొచ్చినట్లు టీటీడీ ఈవో జె.శ్యామల రావు అన్నారు. తిరుమలలో గత ఆరు నెలల్లో జరిగిన అభివృద్ధిపై ఆయన తిరుమలలోని అన్నమయ్య భవనంలో ఆదివారం ఉదయం మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విజన్ డాక్యుమెంట్ కు అనుగుణంగా ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు తెలియజేశారు.ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ తిరుమల క్షేత్రాన్ని ఆదర్శ నగరంగా తీర్చిదిద్దడమే తిరుమల విజన్-2047 లక్ష్యమని అన్నారు. తిరుమలలో గత ఆరు నెలల్లో భక్తులకు మరింత నాణ్యంగా అన్నప్రసాదాలు, లడ్డూ ప్రసాదాలు పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. నాణ్యమైన నెయ్యితో లడ్డూ ప్రసాదాల తయారు చేస్తున్నట్లు తెలిపారు.ఎన్డీడీబీ విరాళంగా ఇచ్చిన రూ.70 లక్షల పరికరాలతో టీటీడీ సొంతగా కల్తీ పరీక్షల ల్యాబ్ ఏర్పాటు చేసినట్లు తెలియజేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు తిరుమలలో సాధారణ భక్తులకు పెద్దపీట వేస్తూ వారికి చక్కటి సౌకర్యాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.తిరుమల, తిరుచానూరు బ్రహ్మోత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించినట్లు తెలియజేశారు. పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించినట్లు చెప్పారు. క్యూలైన్ల నిర్వహణ, భక్తులు క్యూలైన్లలో ఎక్కువ సమయం వేచి ఉండకుండా అదనపు ఈవో నిరంతరం పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు. 45 అతిథి గృహాలకు వారి సొంత పేర్లను తొలగించి, ఆధ్యాత్మిక పేర్లు ఉండేలా చర్యలు చేపట్టామన్నారు.స్వర్ణాంధ్ర విజన్-2047కు అనుగుణంగా తిరుమల విజన్-2047 కోసం ప్రతిపాదనలు ఆహ్వానించినట్లు తెలిపారు. తిరుమలను ప్రణాళికబద్ధంగా అభివృద్ధి చేయనున్నామని పేర్కొన్నారు. 2019 తుడా మాస్టర్ ప్లాన్ లో భాగంగా తిరుమల జోనల్ ప్లాన్ ను తయారు చేయడం జరిగిందన్నారు.అయితే 2017 సంవత్సరం సమాచారం ఆధారంగా చేసిన ప్రతిపాదనలను ఆధునీకరించినట్లు తెలియజేశారు. దేశంలోనే ఇతర ఆలయాలకు ఆదర్శవంతంగా తిరుమల క్షేత్రాన్ని తీర్చిదిద్దేందుకు చర్యలు చేపట్టామన్నారు. సుమారు 18 ప్రాజెక్టులకు ప్రణాళికల కోసం చేసేందుకు 9 సంపూర్ణ నివేదికలను తయారు చేస్తున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా తిరుమల విజన్-2047 లక్ష్యాలను వివరించారు.

తిరుమల విజన్-2047 లక్ష్యాలు

-తిరుమల నడక మార్గాల ఆధునీకరణ, బహుళస్థాయి పార్కింగ్, స్మార్ట్ పార్కింగ్, నూతన లింక్ రోడ్డుల నిర్మాణం, సబ్ వే ల నిర్మాణం, రామ్ భగీచ, బాలాజీ బస్టాండులను పునర్నిర్మాణం.

-భక్తులకు వసతి కోసం అలిపిరి దగ్గర 40 ఎకరాల్లో బేస్ క్యాంప్ ఏర్పాటు, ఆధ్యాత్మికత ప్రతిబింభించేలా తిరుమలలో భవనాల రూపకల్పన.

-టీటీడీలో ఉన్న 31 మంది హిందూయేతర ఉద్యోగులను ప్రభుత్వ శాఖలకు పంపడం, లేదా వీఆర్ఎస్ ఇవ్వాలని బోర్డు నిర్ణయం మేరకు చర్యలు.

-తిరుమలలో రోడ్ల ఆక్రమణ చేస్తూ భక్తులకు ఇబ్బంది కలిగిస్తున్న దుకాణదారులు, హాకర్ లైసెన్సుదారుల, అనధికార తట్టలపై కఠిన చర్యలు.

-తిరుమలలో ట్రాఫిక్ నియంత్రణ, అవసరమైన పార్కింగ్, మౌలిక సదుపాయాలు, మాడ వీధుల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి.

-ఆకాశగంగ, పాపవినాశనం ప్రాంతాల్లో అభివృద్ధికి చర్యలు.

-సనాతన హిందూ ధర్మ ప్రచారం, పరిరక్షణలో యువతను భాగస్వామ్యం చేసేందుకు కృషి. ప్రభుత్వ సలహాదారు చాగంటి కోటేశ్వరరావు సహకారంతో యువతలో ఆధ్యాత్మికత పెంచేలా చర్యలు.

-ఇప్పటి వరకు చేపట్టిన హెచ్డీపీపీ కార్యక్రమాలపై ఆడిట్ నిర్వహించి మరింత మెరుగ్గా కార్యక్రమాలు నిర్వహణ.

-తిరుమలలోని ప్రైవేట్ క్యాంటీన్లలో ధరలు నియంత్రించి, పేరొందిన సంస్థలకు నిర్వహణా బాధ్యతలు అప్పగించి నాణ్యమైన భోజనం అందించేలా చర్యలు.

-తిరుమలలో వ్యర్థాల నిర్వహణకు ప్రత్యేక చర్యలు, వర్షపు నీరు, మురుగు నీరు వేరు వేరుగా వెళ్లేలా డ్రెయిన్ల నిర్మాణం.

-సాంకేతిక పరిజ్ఞానంతో భక్తులకు నిర్ణీత సమయంలో దర్శనం, వసతి అందించేలా చర్యలు.

-చాట్ జీపీటీ తరహాలో వాయిస్ ఆధారిత టీటీడీ చాట్ బాట్ అభివృద్ధికి ప్రయత్నం.

-గతంలో ఉన్న వ్యవస్థపరమైన లోపాలను అడ్డుపెట్టుకుని భక్తులను మోసం చేస్తున్న వారిపై కఠిన చర్యలు. ఎప్పటికప్పుడు పోలీసులు, విజిలెన్స్ సహకారంతో దళారుల నియంత్రణ.

-టిటిడి ఆధ్వర్యంలో ఉన్న 61 ఆలయాలను ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేసేందుకు చర్యలు

ఈ కార్యక్రమంలో టీటీడీ అదనపు ఈవో సి. హెచ్.వెంకయ్య చౌదరి, జేఈవో గౌతమి, సీవీఎస్వో శ్రీధర్, సీఈ శ్రీ సత్య నారాయణ పాల్గొన్నారు.

# కరీంనగర్ కాంగ్రెస్ నేతల అసమ్మతి రాగం..!



కరీంనగర్: పార్టీ ఛలో రాజ్‌భవన్ అంటూ ఆందోళన చేపట్టింది. సేమ్‌టైమ్ ఆ జిల్లా హస్తం నేతలు మాత్రం ఓ సీక్రెట్ మీటింగ్ పెట్టుకున్నారు. అమాత్యుడి తీరుపై అసమ్మతి గళం వినిపించారు. డీసీసీ ఆఫీస్‌లో జరిగిన ఆ సమావేశం కరీంనగర్ కాంగ్రెస్ లో కల్లోలం సృష్టిస్తోంది. తనపైనే ధిక్కార స్వరమా అంటూ ఆ మంత్రి గరం గరం అవుతన్నారట. ఇంతకీ ఆ అసమ్మతి నేతలెవరు.? ధిక్కార స్వరం వెనుక ఉన్న కారణమేంటి.? ఆ నేతలు టార్గెట్ చేసిన మంత్రి ఎవరు.?

కరీంనగర్ కాంగ్రెస్ పార్టీలో ముసలం..

కరీంనగర్ కాంగ్రెస్ పార్టీలో ముసలం మొదలైంది. అధికారంలోకి వచ్చి ఏడాది గడిచినా పార్టీ కోసం కష్టపడిన వారికి ప్రాధాన్యత దక్కడం లేదంటూ డీసీసీ ఆఫీస్‌లో అసమ్మతి నేతలు సమావేశమవటం..రచ్చకు దారి తీస్తోంది. పార్టీలోకి కొత్తగా వచ్చిన వారికి ప్రాధాన్యత ఇస్తున్నారని సీనియర్లు అసహనం వ్యక్తం చేశారు. కరీంనగర్ నియోజకవర్గ ఇంచార్జ్ పురమళ్ల శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన ఓపెన్ సీక్రెట్ మీటింగ్‌కు కాంగ్రెస్ శ్రేణులు పెద్ద సంఖ్యలో హాజరవడంతో పార్టీలో ఒక్కసారిగా కలకలం మొదలైంది. అంతర్గత విభేధాలు రచ్చకెక్కినట్లయింది. అధిష్టానం తీరుపైనా కొందరు అసహనం వ్యక్తం చేస్తే.. మరికొందరు ఏకంగా మంత్రి పొన్నం ప్రభాకర్‌నే టార్గెట్ చేస్తూ తమ ఆవేదనను వెళ్లగక్కారట.

అధికారంలో ఉన్నామన్న ఆనందం లేకుండా పోయిందని ఆవేదన..

నియోజకవర్గ ఇంచార్జ్ కీలకం అని సీఎం రేవంత్ రెడ్డి చెప్తుంటే..తనకు తెలియకుండానే మంత్రి పొన్నం ప్రభాకరే అన్ని నిర్ణయాలు తీసుకుంటున్నారని ఆగ్రహంగా ఉన్నారట పురమళ్ళ శ్రీనివాస్. ఇటీవల భర్తీ చేసిన సుడా చైర్మన్, లైబ్రరీ చైర్మన్ నామినేటెడ్ పదవులతో పాటు నిధుల కేటాయింపు, ఇసుక రీచ్‌ల కేటాయింపులన్నీ ఎవరికీ సంబంధం లేకుండా మంత్రి పొన్నం సొంత నిర్ణయాలు తీసుకుంటున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారట. ఉమ్మడి జిల్లాకు చెందిన మంత్రి శ్రీధర్ బాబు జిల్లా కేంద్రానికి వస్తే సమాచారం ఇస్తున్నారు కానీ..మంత్రి పొన్నం ప్రభాకర్‌తో పాటు ఇతర మంత్రులు వస్తే సమాచారం ఇవ్వడం లేదంటూ మండిపడుతున్నారట జిల్లా కాంగ్రెస్ సీనియర్ నేతలు. కనీసం ప్రోటోకాల్ కూడా పాటించడం లేదని..కార్యకర్తలకు పనులు అవసరమైతే ఎవరి దగ్గరికి వెళ్లాలో తెలియడం లేదంటున్నారు. ప్రతిపక్షంలో చెమటోడ్చి శ్రమిస్తే ఇప్పుడు అధికారంలో ఉన్నామన్న ఆనందం లేకుండా పోయిందంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారట మరికొందరు నేతలు.కరీంనగర్ జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ గెలవకపోవడంతో..మంత్రుల దగ్గరకు క్యాడర్ వెళ్ళాల్సిన పరిస్థితి నెలకొంది. శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్ ఉమ్మడి జిల్లాకు చెందిన మంత్రులే అయినా%‌ౌ%ఎవరి అనుచరవర్గం వారిని ఫాలో అవుతున్నారు. అయితే క్యాడర్ ఎవరి వెంట నడవాలో అర్థం కానీ గందరగోళం నెలకొందట. తమ నేతలను టార్గెట్ చేయడంపై పొన్నం అనుచరులు సీరియస్ అవుతున్నారు. ఎన్నికల ముందు పార్టీలోకి వచ్చినవారు ఇష్టం వచ్చినట్లు మాట్లాడితే ఊరుకునేది లేదంటూ వార్నింగ్ ఇస్తుండటంతో..ఎవరికి వారే యమునా తీరే అన్నట్లుగా మారిపోయింది కరీంనగర్ కాంగ్రెస్ లీడర్ల పరిస్థితి. పార్టీని బలోపేతం చేయాల్సిందిపోయి..వర్గ విభేధాలతో నష్టం చేస్తున్నారన్న గుసగుసలు వినిపిస్తున్నాయి.డీసీసీ కార్యాలయంలో జరిగిన మీటింగ్‌పై అధిష్టానం సీరియస్‌గా ఉందట. ఆ మీటింగ్‌లో పాల్గొని మంత్రి పొన్నంకు వ్యతిరేకంగా మాట్లాడిన వారిని ఎలాగైనా పార్టీ నుంచి పంపించేయాలనే ప్రయత్నాలు జోరుగా సాగుతున్నాయనే టాక్ వినిపిస్తోంది. షోకాజ్ నోటీసులు కూడా రెడీ అవుతున్నాయట. మరి కరీంనగర్ కాంగ్రెస్‌లో మొదలైన ముసలం ఎటుదారి తీస్తుందో వేచి చూడాలి.

# భద్రతను తగ్గించుకున్న చంద్రబాబు




అమరావతి,జడ్ ప్లస్ కేటగిరీలో ఉన్న ముఖ్యమంత్రి చంద్రబాబు తన భద్రతా సిబ్బందిని భారీగా తగ్గించారు. గతంలో ప్రభుత్వంలో ముఖ్యమంత్రి భద్రత కోసం 980 మంది సిబ్బందిని వాడేవారు. కానీ, తనకు ఆ స్థాయిలో భద్రత అవసరం లేదని, అవసరమైన మేర సిబ్బంది ఉంటే చాలని తన భద్రతా విధుల కోసం నియమించిన పోలీసులను వెనక్కి పంపారు ముఖ్యమంత్రి చంద్రబాబు. సీఎం సూచనలతో ఇప్పుడు ఆయన భద్రతకు కేవలం 121 మంది పోలీసు అధికారులను మాత్రమే వాడుతున్నారు.మావోయిస్టుల హిట్ లిస్టులో ఉన్న ముఖ్యమంత్రి చంద్రబాబుకు జడ్ ప్లస్ కేటగిరీ రక్షణ ఉంటుంది. ఆయన విపక్షంలో ఉన్నప్పుడు కూడా ఎన్ఎస్జీ రక్షణ వలయం ఉండేది. దేశంలో అత్యంత ప్రముఖులకు మాత్రమే ఎన్ఎస్జీ రక్షణ ఉంటుంది. దేశంలో సీనియర్ ముఖ్యమంత్రిగా చంద్రబాబుకు కేంద్ర ప్రభుత్వం రెండు దశాబ్దాల క్రితమే జడ్ ప్లస్ కేటగిరీ భద్రత కల్పించింది. రెండు తెలుగు రాష్ట్రాల్లో మరే నేతకు జడ్ ప్లస్ కేటగిరీ సెక్యూరిటీ కల్పించడం లేదు. పదవిలో ఉన్నా లేకపోయినా చంద్రబాబుకు మాత్రమే జడ్ ప్లస్ కేటగిరీలో ఎన్ఎస్జీ సెక్యూరిటీ ఉంటుంది. ప్రస్తుతం సీఎంగా ఉన్న చంద్రబాబు కోరినంత మందిని సెక్యూరిటీగా పెట్టుకోవచ్చు. కానీ, ముఖ్యమంత్రి అనవసర హంగామా వద్దనుకున్నారు. సింపుల్ గవర్నమెంట్ ఎఫెక్టివ్ గవర్నెన్స్ ఇవ్వాలని భావిస్తున్న ముఖ్యమంత్రి తన వద్ద నుంచే ప్రక్షాళన మొదలుపెట్టారు.తన భద్రతా సిబ్బంది సంఖ్యను భారీగా తగ్గించిన ముఖ్యమంత్రి కాన్వాయ్ లోని వాహనాలను కూడా అదేస్థాయిలో తగ్గించారు. గతంలో ముఖ్యమంత్రి కాన్వాయ్ కోసం 17 వాహనాలు వినియోగిస్తే ఇప్పుడు వాటి సంఖ్యను 11కి పరిమితం చేశారు. దీనివల్ల సిబ్బంది తగ్గడమే కాకుండా ఇంధన ఖర్చులు కూడా ఆదా అవుతాయని ప్రభుత్వం చెబుతోంది. అదేమాదిరిగా తన పర్యటన సమయాల్లో ఎక్కువ సేపు ట్రాఫిక్ నిలపడం కానీ, పరదాలు కట్టడం, బారీకేడ్లు ఏర్పాటు చేయడం వద్దని చెబుతున్నారు. ముఖ్యమంత్రి అయిన వెంటనే ఈ నిర్ణయం తీసుకున్న చంద్రబాబు ఇటీవల పోలవరం పర్యటనలో అక్కడి పోలీసు యంత్రాంగం ఎక్కువగా మోహరించడాన్ని చూసి అధికారులకు క్లాస్ తీసుకున్నారని చెబుతున్నారు. తన కోసం ప్రత్యేక ఏర్పాట్లు ఏవీ చేయొద్దని చెప్పినా, అధికారులు ఆ అదేశాలను పాటించకపోవడంపై సీఎం అసంతృప్తి వ్యక్తం చేశారని సమాచారం.భద్రత తగ్గించమని సీఎం స్పష్టమైన ఆదేశాలు జారీ చేయడంతో పోలీసు శాఖ తగిన జాగ్రత్తలు తీసుకుంది. సిబ్బంది సంఖ్యను భారీగా తగ్గించినా, బందోబస్తు పర్యవేక్షణకు టెక్నాలజీ వాడుకుంటోంది. అటానమస్ డ్రోన్ వ్యవస్థను సీఎం సెక్యూరిటీ కోసం వాడుతున్నారు. ఈ డ్రోన్ ముఖ్యమంత్రి నివాసం ఉంటున్న ఉండవల్లిలో ప్రతి రెండు గంటలకు ఒకసారి గగనతలంలో చక్కర్లు కొడుతుంది. అనుమానిత వస్తువులు, కదలికలు ఉంటే వెంటనే పోలీసు కంట్రోల్ రూముకి సమాచారమిస్తుంది. ఈ డ్రోనును ఎవరూ ఆపరేట్ చేయరు. తనకు తానుగా గాల్లోకి ఎగిరి తన విధులు నిర్వహిస్తుంది. మళ్లీ యథావిధిగా తన ల్యాండింగ్ ప్లేసుకు చేరుకుని సొంతంగా చార్జింగ్ పెట్టుకుంటుంది. ఈ అధునాతన టెక్నాలజీ కూడా ముఖ్యమంత్రి భద్రతా సిబ్బంది తగ్గింపునకు ఉపయోగపడింది.

## చాగంటికి మరో బాధ్యతను అప్పగించిన ఏపీ ప్రభుత్వం

అమరావతి, ప్రముఖ ప్రవచనకర్త చాగంటి కోటేశ్వరరావును విద్యార్థులు – నైతిక విలువల సలహాదారుగా ఏపీ ప్రభుత్వం నియమించిన సంగతి తెలిసిందే. కేబినెట్ హోదా కలిగిన ఈ బాధ్యతలను ఆయనకు ప్రభుత్వం అప్పగించింది. ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఆ తర్వాత ఆయన బాధ్యతలను స్వీకరించారు. తాజాగా చాగంటికి ఏపీ ప్రభుత్వం మరో కీలక బాధ్యతను అప్పగించింది. విద్యార్థుల్లో నైతిక విలువలను పెంచేందుకు చాగంటితో ప్రభుత్వం ప్రత్యేకంగా పుస్తకాలను తయారు చేయించి, విద్యార్థులకు పంపిణీ చేయనుంది.

# దేవినేని ఉమాకు మళ్లీ రాజకీయ యోగం దక్కేనా?



అమరావతి,మొన్నటి వరకు పార్టీలో ఆయన ఎంత చెప్తే అంత. జిల్లా రాజకీయాల్లో సింగిల్ హ్యాండ్ గణేష్‌లా చక్రం తిప్పేవారు. పార్టీకి, అధినాయకుడికి వీరవిధేయుడు. కానీ ఆ ఫైర్ బ్రాండ్ లీడర్ ప్రభావం ఇప్పుడు తగ్గిపోయింది. పార్టీ బంపర్ విక్టరీ సాధించినప్పుడు ఆయన సీటు త్యాగం చేయాల్సి వచ్చింది. ఎందరికో పదవులు ఇప్పించిన ఆ నేత.. ఇప్పుడు తనకే ఎమ్మెల్సీ పదవి దక్కుతుందోలేదోనని ఎదురుచూసే పరిస్థితి వచ్చింది. ఆ మాజీమంత్రికి మళ్లీ పూర్వవైభవం దక్కబోతోందా.? ఎమ్మెల్సీ రేసులో ఆనయనెంత దూరం.?

కళ్ళ ముందే కుప్పకూలిన రాజకీయ సామ్రాజ్యం..

మొన్నటి వరకు ఒంటి చేత్తో జిల్లా రాజకీయాలను నడిపించిన ట్రాక్ రికార్డు మాజీ మంత్రి దేవినేని ఉమాది. వైసీపీ ప్రభుత్వ హయాంలో నిరంతరం పోరాడిన నేతగా కూడా ఆయనకు గుర్తింపు ఉంది. ఒకప్పుడు కృష్ణా జిల్లా టీడీపీలో ఆయన గీసిన గీతను దాటడానికి కూడా ఏ నాయకుడు సాహసించే వారు కాదు. కానీ కళ్ళ ముందే ఆయన రాజకీయ సామ్రాజ్యం కుప్పకూలిపోయింది. మొన్నటి ఎన్నికల్లో ఆయనకు టిక్కెట్ కూడా దక్కని పరిస్థితి. చివరికి ఇప్పుడు ఎమ్మెల్సీ పదవి కోసం ఎదురు చూడాల్సిన సిచ్యువేషన్‌లో ఉన్నారు దేవినేని ఉమా.సోదరుడు దేవినేని రమణ అకాల మరణంతో పొలిటికల్ ఎంట్రీ ఇచ్చిన ఉమా టీడీపీలో అంచెలంచెలుగా ఎదిగి తనదైన ముద్ర వేసుకున్నారు. ఉమ్మడి కృష్ణా జిల్లాలో తెలుగుదేశం పార్టీ అంటే దేవినేని ఉమా.. ఉమా అంటే తెలుగుదేశం పార్టీ అనే స్థాయిలో బ్రాండ్ క్రియేట్ చేసుకున్నారు. అయితే ఓడ లు బండ్లు.. బండ్లు ఓడలు అయినట్లు ఉమా రాజకీయ ప్రభావం తగ్గిపోయిం ది. జిల్లా రాజకీయాలను..పార్టీ వ్యవహారాలను తన కనుసైగతో చక్కబెట్టిన ఉమాకు..ఇప్పుడు ఓ పదవి అంటూ లేకుండా పోయింది. గత ఐదేళ్లలో పార్టీలో జరిగిన పరిణామాలు పొలిటికల్‌గా ఆయనను డ్యామేజ్ చేశాయన్న టాక్ ఉంది.

ఏ కార్యకర్తకు కష్టం వచ్చినా నేను ఉన్నానంటూ ముందుకు వచ్చే నాయకుడు..

వైసీపీ ప్రభుత్వంపై అలుపెరుగని పోరాటం చేశారు దేవినేని ఉమా. అయినప్పటికీ కృష్ణా జిల్లా టీడీపీలో దేవినేని ప్రాధాన్యత క్రమ క్రమంగా తగ్గిపోయింది. మొన్నటి ఎన్నికల్లో మైలవరం నియోజకవర్గంలో ఉమాను కాదని వైసీపీ నుంచి వచ్చిన వసంత కృష్ణప్రసాద్‌కు టికెట్ కట్టబెట్టారు. దేవినేని ఉమాకి ఎమ్మెల్సీ పదవి ఇస్తామని హైకమాండ్ హామీ ఇచ్చింది. దాంతో పార్టీ నిర్ణయానికి కట్టుబడి వసంత కృష్ణప్రసాద్ గెలుపు కోసం పని చేశారాయన. అయితే టీడీపీ పవర్‌లోకి వచ్చాక..ఉమాకు మంచి పదవి దక్కుతుందని ప్రచారం జరుగుతూ వస్తోంది.పార్టీ అధినేత చంద్రబాబు, నారా లోకేశ్‌లు కూడా దేవినేని ఉమా పట్ల సానుకూలంగా ఉన్నారట. పార్టీలో ఎన్ని అవమానాలు ఎదురైనా ఎన్ని ఇబ్బందులు వచ్చినా అధినేత మాట జవదాటని నాయకుడిగా..పార్టీ పట్ల అంకితభావంతో పని చేసిన నేతగా ఆయనకు ఉన్న గుర్తింపే ఎమ్మెల్సీ పదవిని తెచ్చిపెడుతుందని టీడీపీలో చర్చ జరుగుతోంది. ఉమ్మడి కృష్ణా జిల్లాలో ఏ కార్యకర్తకు కష్టం వచ్చినా నేను ఉన్నానంటూ ముందుకు వచ్చే నాయకుడు ఉమా అని ద్వితీయ శ్రేణి లీడర్లు చెబుతున్నారు. త్వరలోనే ఆయనకు ఎమ్మెల్సీ పదవి ఖాయమంటూ చర్చించుకుంటున్నారు తెలుగు తమ్ముళ్లు.మైలవరంలో కూడా ఉమా లేని లోటు కనిపిస్తుందని ఆయన అనుచరులు అంటున్నారు. గొల్లపూడి ఆఫీస్‌లో నిత్యం కార్యకర్తలకు అందుబాటులో ఉంటూ వారికి ఏ సమస్య వచ్చినా నిమిషాల్లో వాలిపోయేవారట ఉమా. ప్రస్తుతం వసంత కృష్ణప్రసాద్ అందుబాటులో ఉండటం లేదనేది అక్కడి కార్యకర్తలు చెబుతున్న మాట. అందరూ దేవినేని నివాసానికి వెళ్తున్నప్పటికీ ఆయన సున్నితంగా ఎమ్మెల్యేతో పని చేయించుకోవాలంటూ చెబుతున్నారట. గతంలోలాగా అన్ని వ్యవహారాలు మీద వేసుకోకుండా పార్టీ క్రమశిక్షణకు కట్టుబడి స్పందిస్తున్నారని చెబుతున్నారు ఆయన అనుచరులు. దాంతో గతంలో ఉమ్మడి కృష్ణా జిల్లాలో దేవినేని ఉమాను తీవ్రంగా వ్యతిరేకించిన నాయకులంతా ఇప్పుడు ఆయన పట్ల సానుభూతి వ్యక్తం చేస్తున్నారట. ఏది ఏమైనా సీనియర్ నేతల తీరే వేరు అంటూ దేవినేని ఉమాను తెగ పొగిడేస్తున్నారట

Printed, Published and Owned by UPPUGALLA SANTHOSH KUMAR H.NO. 10-19/286/1, RAVINDRA NAGAR COLONY, NAGARAM VILLAGE, KEESERA MANDAL, DIST.RANGA REDDY, PIN -500083, TELANGANA, Printed at SRI SAI GRAPHICS 9-52/3, ROAD NO.8, S.V.NAGAR, NAGARAM KEESARA, DIST. RANGA REDDY, PIN -500083, TELANGANA . RNI No : TELTEL/2015/66279 Editor : UPPUGALLA SANTHOSH KUMAR Cell : +918247019090. Email : agranetha@gmail.com